బుధవారం
07-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 77
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ట్రస్‌ను ప్రధానిగా నియమించిన బ్రిటన్ రాణి

కన్సర్వేటివ్‌పార్టీ అధినేతగా విజయం సాధించిన లిజ్ ట్రస్(47)ను రాణి ఎలిజబెత్-2 బ్రిటన్ కొత్త ప్రధానిగా మంగళవారం అధికారికంగా నియమించారు. స్కాట్లాండ్‌లోని బాల్మోరల్ క్యాజిల్‌లో ఉన్న రాణితో లిజ్ ట్రస్ సమావేశమయ్యారు. 2లో

చర్చలతోనే పరిష్కారం

- సీఎస్‌లు, అవసరమైతే సీఎం స్థాయిలో మాట్లాడుకోవాలి
- పోలవరం అభ్యంతరాలపై సుప్రీం సూచన
- వాస్తవ నివేదిక సమర్పించాలని జలశక్తికి ఆదేశం
- తదుపరి విచారణ డిసెంబరు 7కి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం ప్రాజెక్టు అభ్యంతరాలపై అవసరమైతే ముఖ్యమంత్రులు, లేకుంటే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల స్థాయిలో చర్చలు జరపడం ద్వారా పరిష్కారం చేసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై పొరుగు రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల తమ రాష్ట్రాల్లో ముంపు సమస్యలు వస్తున్నాయని తెలంగాణతో పాటు ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు, సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ప్రాజెక్టుకు ఇచ్చిన పర్యావరణ అనుమతులు ఉల్లంఘించి నిర్మాణం చేపట్టారని, ప్రాజెక్టు నిర్మాణాన్ని విస్తరించారని ఆ మూడు రాష్ట్రాలు ఆరోపించాయి. రాష్ట్రాలు, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఇచ్చిన అనుమతులకు, ప్రాజెక్టు నిర్మాణానికి పొంతన లేదని పేర్కొన్నాయి. పర్యావరణ అనుమతులపై పునః సమీక్ష చేయాలని మూడు రాష్ట్రాలు కోరాయి. పోలవరం నిర్మాణం వల్ల భద్రాచలం ఆలయం ముంపునకు గురవుతుందని బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ - మిగతా 2 లో

విపక్షాల ఐక్యతకు
ఇదే తరుణం

- ప్రధాని పదవికి నేను హక్కుదారు కాదు... ఆశ లేదు
- బీహార్ సీఎం నితీశ్ కుమార్
- రాజా, ఏచూరితో సమావేశం

న్యూదిల్లీ: ప్రధానమంత్రి పదవికి తాను హక్కుదారు కాదని, కనీసం దానిపై ఆశ కూడా లేదని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మంగళవారం అన్నారు. తన దిల్లీ పర్యటన ప్రతిపక్ష పార్టీలకు నాయకత్వం వహించేందుకేనన్న ఊహాగానాల నడుమ జేడీ(యూ) నేత నితీశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. వామపక్షాలు, కాంగ్రెస్, అన్ని ప్రాంతీయ పార్టీలు ఐక్య ప్రతిపక్షంగా ఏర్పడాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టంచేశారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాను తమ పార్టీ కార్యాలయాల్లో కలిసిన అనంతరం నితీశ్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. గత నెలలో ఎన్‌డీఏతో బంధం తెంచుకున్న తర్వాత నితీశ్ కీలక ప్రతిపక్ష నేతలను కలవడానికి రాజధానికి చేరుకున్నారు. 'నాకు చిన్నప్పటి నుంచి సీపీఎంతో సుదీర్ఘ అనుబంధం ఉంది.. మీరంతా నన్ను చూడలేదు. కానీ నేను దిల్లీకి వచ్చినప్పుడల్లా ఈ కార్యాలయానికి వచ్చేవాడిని. మేము విడిపోయాం... కానీ ఈరోజు అందరూ మళ్లీ కలిసి ఉన్నాం. మా దృష్టి అంతా వామపక్షాలు, ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్‌ను ఏకం చేయడంపైనే ఉంది. మనమందరం ఒక్కతాటిపైకి వస్తే ఇదే పెద్ద విషయం' అని నితీశ్ తెలిపారు. ప్రధాని పదవి కోసం తన ఆకాంక్ష గురించి అడిగిన ప్రశ్నకు నితీశ్ స్పందిస్తూ, 'ఇది తప్పు. నేను ఆ పదవికి హక్కుదారుడిని కాదు లేదా నేను కోరుకోవడం లేదు' అని అన్నారు. కాగా నితీశ్ కుమార్ తిరిగి ప్రతిపక్షంలోకి రావడం, బీజేపీకి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భాగం కావాలనే ఆయన కోరిక దేశ రాజకీయాలకు గొప్ప సంకేతమని ఏచూరి అన్నారు. 'మొదట, అన్ని పార్టీలను ఏకం చేయడమే అజెండా. ప్రధానమంత్రి అభ్యర్థిని నిర్ణయించడం కాదు. సమయం వచ్చినప్పుడు మేము ప్రధానమంత్రి అభ్యర్థిని నిర్ణయిస్తాం. మీకు తెలియజేస్తాం' అని ఏచూరి తెలిపారు. ప్రస్తుతానికి ప్రతిపక్షాలు ఎలాంటి పటిష్ట కార్యాచరణను రూపొందించలేదని, అయితే - మిగతా 2 లో

ఏపీకి ఉపశమనం

- ఆదాయలోటు కింద రూ.879 కోట్లు
- మరో 13 రాష్ట్రాలకూ విడుదల చేసిన కేంద్రం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఏపీకి కేంద్రం తాజాగా విడుదల చేసిన రెవెన్యూ గ్రాంటు నిధులతో కొంత ఉపశమనం లభించింది. ఆంధ్రప్రదేశ్, కేరళ, అసోం, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ సహా 14 రాష్ట్రాలకు రూ.7,183 కోట్ల ఆదాయ లోటును కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. వ్యయ శాఖ 14 రాష్ట్రాలకు 7,183.42 కోట్ల రూపాయల పోస్ట్ డివల్యూషన్ రెవెన్యూ డెఫిసిట్ (పీడీఆర్‌డీ) గ్రాంట్ 6వ నెలవారీ వాయిదాను విడుదల చేసింది. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ఈ గ్రాంట్‌ను విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 15వ ఆర్థిక సంఘం 2022-23 ఆర్థిక సంవత్సరానికి 14 రాష్ట్రాలకు మొత్తం రూ.86,201 కోట్ల వికేంద్రీకరణ అనంతర ఆదాయ లోటు గ్రాంట్‌ను సిఫార్సు చేసింది. సిఫార్సు చేసిన గ్రాంట్‌ను 12 సమానమైన నెలవారీ వాయిదాలలో సిఫార్సు చేయబడిన రాష్ట్రాలకు వ్యయ శాఖ విడుదల చేస్తుంది. 2022 సెప్టెంబర్‌లో 6వ విడత - మిగతా 2 లో

19 నుంచి అసెంబ్లీ సమావేశాలు?

ఐదు రోజులు నిర్వహించాలని నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను ఈనెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. బుధవారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించనున్నారు. శాసనసభ సమావేశాల్లో చర్చించే అంశాలు, ప్రవేశపెట్టే బిల్లులపై మంత్రివర్గ ఆమోదం అనంతరం అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. రాజధాని రైతుల ఉద్యమం ఈనెల 12వ తేదీకి 1000 రోజులు - మిగతా 2 లో

నాసల్ టీకాకు కేంద్రం అనుమతి

భారత్ బయోటెక్ మరో అద్భుతం

న్యూదిల్లీ: కోవిడ్ నుంచి రక్షణ కల్పించేందుకు భారత్ బయోటెక్ రూపొందించిన ముక్కు ద్వారా ఇచ్చే చుక్కల మందు (నాసల్ వాక్సిన్)కు అత్యవసర వినియోగ అనుమతి లభించింది. ఈ మేరకు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా అనుమతి ఇచ్చినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ట్విటర్ ద్వారా వెల్లడించారు. 18 ఏళ్లు పైబడిన వారికి ఈ టీకా ఇచ్చేందుకు అత్యవసర అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. కోవిడ్‌పై భారత్ సాగిస్తున్న పోరును ఈ టీకా మరింత బలోపేతం చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగం, అందరి సహకారంతో భారత్ సమర్థంగా కోవిడ్‌ను ఓడిస్తామని మంత్రి ధీమా వ్యక్తంచేశారు. దేశంలో అనుమతి పొందిన తొలి నాసల్ వాక్సిన్ ఇదే కావడం గమనార్హం. నాసల్ వాక్సిన్‌కు సంబంధించి - మిగతా 2 లో

మోదీ నియంతృత్వ పాలన

- హక్కులు మర్చిపోండి.. పనులు చేయండి
- ఇదీ కేంద్ర ప్రభుత్వ నినాదం
- 'కర్తవ్యపథ్' వెనుక అన్నీ దురుద్దేశాలే

న్యూదిల్లీ: దేశంలో నియంత పాలన దిశగా మోదీ సర్కారు చకాచకా అడుగులు వేస్తోంది. అఖండ భారత్-హిందూత్వ రాజ్యం పేరిట ప్రజలను మభ్యపెట్టి తమ దురుద్దేశాలకు రూపం ఇవ్వాలని చూస్తోంది. అందుకోసం మార్గాన్ని సుగమం చేసుకునే ప్రయత్నం చేస్తోంది. అన్నదమ్ముల మాదిరిగా కలిసి ఉండే అన్యమతస్తుల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకునే పనిని వేగవంతం చేసింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను ధన, కండబలంతో కూల్చివేసి దేశం మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవడానికి కుట్రలు సాగిస్తోంది. అందులో భాగంగా ఒకదాని తర్వాత ఒకటిగా అడుగులు వేస్తూ అన్నింటా తమదైన ముద్ర ఉండాలని పేర్లు మార్చేస్తోంది. మరోవైపు హక్కుల గురించి మర్చిపోండి...పనులు మాత్రం చేయండి అంటూ హుకుం జారీ చేస్తోంది.

'మీ హక్కులను మర్చిపోండి... విధులు నిర్వర్తించండి. అదే మీ కర్తవ్యం' అంటూ మోదీ 'కర్తవ్యపథ్' ప్రచారం సాగుతోంది. ఆగస్టు 15న చేసిన ప్రసంగంలో ప్రధాని మోదీ తమ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు ఊసే ఎత్తలేదు. ఆ మేరకు డిమాండ్లను పట్టించుకోకుండా పౌరులంతా తమ విధులు నిర్వర్తించాలని నొక్కిచెప్పారు. ఇది నియంత పాలనకు సూచన. గతంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించిన సమయంలో ఇటువంటి ఆదేశాలు జారీ అయ్యాయి. అప్పటి నుంచి ప్రజాహక్కులను పట్టించుకోనందుకు ప్రభుత్వాలు విమర్శలు ఎదుర్కొంటూనే ఉన్నాయి. హక్కుల కంటే విధులకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా రాజ్‌పథ్‌కు కర్తవ్యపథ్‌గా నామకరణం చేయడం సూచికగా చెప్పవచ్చు. ఆపై శుద్ధీకరణ జరుగుతుంది. అంటే ఆ మార్గంలో చిరు వర్తకులపై కొరఢా ఝుళిపిస్తారు. ఐస్‌క్రీమ్ విక్రేతలకు తోపుడు బండ్లు పెట్టుకునేందుకు అనుమతి ఉండదు. విహారయాత్రల ప్రసక్తే లేకుండా పోతుంది.

బ్రిటీష్ పాలనలో ఈ మార్గం 'కింగ్స్‌వే'(రాజుల మార్గం) కాగా..స్వాతంత్ర్యం వచ్చాక రాజ్‌పథ్(అధికార మార్గం) అయింది. జన్‌పథ్ (ప్రజామార్గం)ను బ్రిటీష్ పాలనలో 'క్వీన్స్ వే' (రాణుల మార్గం) అని పిలిచేవారు. ఈ రెండు మార్గాలు చరిత్రాత్మకమైనవి. ఇక సెంట్రల్ విస్టా - మిగతా 2 లో

నేటి నుంచి కాంగ్రెస్
'భారత్ జోడో యాత్ర'

- కన్యాకుమారి నుంచి ప్రారంభమై శ్రీనగర్ వరకు
- 3,570 కిలోమీటర్ల మేర పాదయాత్ర
- ఈ భారీ ర్యాలీలో రాహుల్‌తో సహా 119 మంది నాయకులు

2లో

సంస్మరణ సభ

జననం: 02-07-1942
మరణం: 23-08-2022

జోహార్ రిటైర్డ్ ఐ.టి.ఐ. ప్రిన్సిపాల్
కీ॥శే॥లు శ్రీ బొమ్మల రామయ్య గారు జోహార్

"నిగర్వి, నిష్కలంకుడు, నిరాడంబరుడు, నిస్వార్ధపరుడు సాంకేతిక విద్యారంగంలో ఎందరికో విద్యను అందించి ఉపాధి కల్పనలో ఎంతోమందికి జీవనోపాధి కల్పించిన మహాప్రదాత అందరికి ఆప్తుడైన బొమ్మల రామయ్య గారు తేది.23-08-2022 మంగళవారం స్వర్గస్తులైనారు.

భార్య : బొమ్మల అంజమ్మ

కుమారులు :
బొమ్మల శ్రీనివాసరావు - 7799009319
బొమ్మల రామలింగేశ్వరరావు - 9581670318
బొమ్మల జనార్ధన్‌రావు - 9701373666
మరియు కుటుంబసభ్యులు

సంస్మరణ సభ : తేది. 07-09-2022 బుధవారం సాయంత్రం గం॥6.30ని॥లకు మద్దిపాడు (మం.), పెద్దకొత్తపల్లి అంజయ్యనగర్‌లో మా స్వగృహం నందు సంస్మరణ సభ జరుగును. ఈ సభలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారు. కావున అందరూ పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

ఇదీ లోకం!

తీరుమారని సర్కారు

- మళ్లీ జీపీఎస్ పల్లవి
- సీపీఎస్‌పై చర్చల సాగదీత
- మంత్రులు బుగ్గన, బొత్సతో సీపీఎస్‌ఈఏ నేతల భేటీ
- ఉద్యోగులపై కేసుల తొలగింపునకు హామీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తీరు మారడం లేదు. పదేపదే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) చర్చల పేరిట ఉద్యోగ సంఘాల నేతలను మంత్రుల కమిటీ బృందం రప్పించుకుని, అక్కడ సీపీఎస్ కాదు... గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) పల్లవి అందుకోవడం పరిపాటిగా మారింది. సీపీఎస్‌ఈయూ, సీపీఎస్‌ఈఏ అధ్వర్యంలో ఈనెల 1వ తేదీన సీఎం నివాస ముట్టడి, చలో విజయవాడకు వేర్వేరుగా పిలుపునిచ్చారు. అప్పటి నుంచి మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, బొత్స సత్యనారాయణతో కూడిన కమిటీ ఆయా సంఘాలను చర్చలకు రెండు విడతలుగా పిలిపించింది. పేరుకు సీపీఎస్ పేరుతో రప్పించి, అక్కడ జీపీఎస్ ప్రతిపాదన తేవడంపై ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈనెల 1వ తేదీన చలో సీఎం నివాసం, చలో విజయవాడకు సీపీఎస్ ఉద్యోగ సంఘాలు వేర్వేరుగా పిలుపునివ్వడంతో జగన్ సర్కారు ఉక్కిరిబిక్కిరైంది. ఒక వైపు ఆయా ఉద్యోగ సంఘాలతో చర్చలు, మరోవైపు ఉద్యమం అణచివేత చర్యలు ఆరంభించింది. సీపీఎస్ నేతలు, ఉద్యోగులకు నోటీసుల జారీ, వారిపై బైండోవర్ కేసులు, నిర్బంధాలతో బెదిరింపు చర్యలకు పాల్పడింది. చలో విజయవాడకు తరలిరాకుండా అన్ని జిల్లాల - మిగతా 2 లో

30 మంది విద్యార్థులకు అస్వస్థత

- వలసపాకల కేంద్రీయ విద్యాలయంలో విషాదం
- సకాలంలో స్పందించిన యాజమాన్యం
- హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలింపు
- సురక్షితంగా ఇంటికి చేరుకున్న చిన్నారులు
- టీచర్స్ డే సెలబ్రేషన్స్‌లో స్ప్రే వాడకమే: ఫుడ్ సేఫ్టీ అధికారులు

విశాలాంధ్ర-కాకినాడ రూరల్: తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకల కేంద్రీయ విద్యాలయంలో 5, 6 తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులు మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకునేందుకు ఉక్కిరిబిక్కిరి అవుతూ, వాంతులు చేసుకో వడంతో స్కూల్ యాజమాన్యం సకాలంలో స్పందించి తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యసేవలందించడంతో సురక్షితంగా బయటపడ్డారు. వివరాలలోకి వెళితే... వలసపాకల కేంద్రీయ విద్యాలయంలో 5, 6 తరగతి విద్యార్థులు శ్వాస ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతూ వాంతులు చేసుకుని కళ్లు తిరుగి పడిపోతుండడంతో స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులకు విషయాన్ని తెలియపరిచింది. హుటాహుటిన అక్కడికి చేరుకున్న తల్లితండ్రులు తమతమ పిల్లలను ఆసుపత్రులకు తీసుకెళ్లడం మొదలుపెట్టారు. సమా చారం అందుకున్న సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని యాజమాన్యం తీరును ప్రశ్నించి హుటాహుటిన కళ్లు తిరిగిపడిపోయిన పిల్లలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంలో చాకచక్యంగా వ్యవహ రించారు. అనంతరం కలెక్టర్ కృతిక శుక్ల దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించి జరిగిన సంఘటనపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని స్కూల్ గదులను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

అనంతరం ఫుడ్ సేఫ్టీ అధికారి నాగూరు మాట్లాడుతూ, టీచర్స్ డే సందర్భంగా స్కూల్ ఆవరణలో కేక్, చాక్లెట్లు విద్యా ర్థులు తిన్నారని, దాంతో పాటు తరగతి గదిలో ఒక రకమైన స్ప్రే వాడారన్నారు. గది తలుపులు మూసి ఉంచడంతో గాలి, వెలుతురు వెళ్లకపోవడం వలన మరుసటి రోజు ఉదయాన్నే ఆ గదిలో విద్యార్థులు వెళ్లగానే కళ్లు మండి, శ్వాస ఆడక, వాంతులు అవ్వడం జరిగిందని పేర్కొన్నారు. స్కూల్‌లో తాగునీటిని పరిశీలన నిమిత్తం ల్యాబ్‌కు తరలించినట్టు చెప్పారు. కేక్, చాక్లెట్లు తిననివారు కూడా అస్వస్థతకు గురయ్యారన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక ఇస్తామన్నారు.

విద్యార్థులను పరామర్శించిన కలెక్టర్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే

కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో విషయం తెలుసుకున్న కాకినాడ రూరల్ నియోజకవర్గం శాసనసభ్యుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, కలెక్టర్ కృతిక శుక్ల, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న 30 విద్యార్థులను పరామర్శించారు. తరగతి గదిలో జరిగిన సంఘటనపై ఆరా తీశారు. చిన్నారుల యోగక్షేమాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రమాదం ఏమీ లేదని, కేవలం అస్వస్థతకు గురయ్యారని వైద్యులు వివరించారు. సంఘటనపై విచారణ చేపట్టి సమగ్ర దర్యాప్తు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

విచారణ చేపట్టాలి: జనసేన నేత పంతం: కేంద్రీయ విద్యాలయంలో జరిగిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని జనసేన నాయకుడు పంతం నానాజీ అన్నారు. సంఘటన జరిగిన వెంటనే విద్యాలయానికి చేరు కుని పరిసరాలను పరిశీలించారు. అనంతరం నానాజీ స్పందిస్తూ అస్వస్థతకు కారణాలను తెలుసుకుని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జనసేన ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టేందుకు వెనకాడమని హెచ్చరించారు.

నాగయ్య పురస్కార విజేతలు వీరే...

తిరువూరు: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఎం.చిననాగయ్య పేరుతో ఏర్పాటు చేసిన నాగయ్య స్మారక పురస్కార (2022) విజేతలను మంగళవారం నాగయ్య మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి ఎం.రాంప్రదీప్ ప్రకటించారు. నా ఏకాంత బృందగానం (స్వీయ చరిత్ర)- డా.జి.అమృత లత (నిజామాబాద్), కోవిడ్ ఎయిడ్స్ నేను (జీవిత చరిత్ర)-వై.మురళీ కృష్ణ (కాకినాడ), పుల్లెల శ్యామ సుందరరావు జీవితం- రచన: డా.కె.ముత్యం (హైదరాబాద్), కరోనా లాక్డౌన్(వ్యాస సంపుటి)-కోడం పవన్ కుమార్ (హైదరాబాద్), అక్షరాభిషేకం (వ్యాస సంపుటి)-డా.అమ్మిన శ్రీనివాసరాజు (వాజేడు), శతారం(కవిత్వ విమర్శనా వ్యాసాలు)-గోపగాని రవీందర్ (లక్సెట్టిపేట), కన్సోలేషన్ బహుమతి- ఆదియోధులు అజరామరులు(వ్యాస సంపుటి)-గుమ్మడి లక్ష్మీ నారాయణ(మహబూబాబాద్). విజేతలకు సెప్టెంబర్ 29న ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో బహుమతులు ప్రదానం చేయనున్నారు.

బిల్కిస్ బానో దోషులను తిరిగి జైలుకు పంపండి

కలెక్టర్‌కు భారత జాతీయ మహిళా సమాఖ్య వినతి

విశాలాంధ్ర-తిరుపతి: బిల్కిస్ బానో అత్యాచార దోషులను గుజరాత్ ప్రభుత్వం సత్ప్రవర్తన పేరుతో జైలు నుంచి విడుదల చేయడాన్ని నిరసిస్తూ భారత జాతీయ మహిళా సమాఖ్య ఇచ్చిన దేశవ్యాపిత పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టర్ వెంకట రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ, గోద్రా ఘటనలో అతి కిరాతకంగా బిల్కిస్ బానో పై అత్యాచారం చేసి, మూడేళ్ల కుమార్తె తో సహా 11 మంది కుటుంబ సభ్యులను అత్యంత అమానవీయంగా హత్య చేసిన కేసులో 19 ఏళ్ల న్యాయ పోరాటం తర్వాత జైలుశిక్షకు గురైన 11 మంది దోషులను మంచి ప్రవర్తన పేరుతో జైలు నుంచి విడుదల చేయడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషులకు క్షమాభిక్ష రద్దు చేసి వారిని తిరిగి జైలుకు పంపాలని కోరారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చెంచమ్మ, నదియా, లక్ష్మి, ప్రమీల, హరిత, పార్వతి, అఖిల, వనిత తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం కంటి తుడుపు చర్యలు

ఆక్రందన సభలో అగ్రిగోల్డ్ బాధితులు

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చేపట్టేందుకు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తానని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్...ఓట్ల కోసం కంటి తడుపు చర్యలు తీసుకున్నారని, తమకు సరైన న్యాయం చేయలేదని అగ్రిగోల్డ్ బాధితులు ఆగ్రహం వెలిబుచ్చారు. అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల సంక్షేమ సంఘం అధ్వర్యంలో మంగళవారం అగ్రిగోల్డ్ బాధితుల 'ఆక్రందన ప్రదర్శన- సభ'లో వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

అండమాన్‌లో ఆస్తులు స్వాధీనం చేసుకోండి

ఏపీలో కొంతమందికైనా కొద్దోగొప్పో న్యాయం జరిగింది. అండమాన్‌లో 500 మంది ఏజెంట్లు రూ.20 కోట్లు డిపాజిట్ చేశారు. నేను 60 మందితో రూ.11కోట్లు కట్టించా. నా సొంతంగా కోటి రూపాయలు కట్టా. ఎవరికీ డబ్బులు ఇవ్వలేదు. ఫోర్టు బ్లెయిర్‌లో అగ్రిగోల్డ్ బ్రాంచీ కోడ్ నంబరు 1100 కింద మేము వ్యాపారం చేశాం. అగ్రిగోల్డ్‌కు ఉన్న ఆస్తుల్ని స్వాధీనం చేసుకుని ఏపీ ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి.

- ఎస్.మహాలక్ష్మీ, అండమాన్

రూ.10వేల లోపు బాండ్‌కు ఇస్తే ఎలా?

నేను ఆదాయం బట్టి 10వేల రూపాయల బాండ్‌లు 42 తీసుకున్నా. రూ.20వేలకు పైన లక్ష రూపాయలలోపు 37 బాండ్‌లు తీసుకున్నా. రూ.10వేల లోపు ఒక్క బాండ్‌కు మాత్రమే డిపాజిట్ ఇచ్చారు. మిగిలిన 41 బాండ్‌ల పరిస్థితి ఏమిటి? నేను మొత్తం 42 లక్షల రూపాయలు కట్టాను. యారాడలో ఉన్న సీఐడీ వారికి అన్ని ఆధారాలు చూపించాను. నా ఒరిజినల్ రికార్డులన్నీ కోర్టులో ఉన్నాయి. నాకు ఏపీ ప్రభుత్వం న్యాయం చేయాలి.

- ఎస్.మధుసూదనరావు, విశాఖపట్నం

అకౌంట్ ఏపీలో ఉన్నా బాధితులం కాదంటున్నారు

మేము ఉండేది తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా ఆరణి గ్రామంలో.. మేము ప్రతి పని ఆంధ్రతో కలిసి ఉంటాం. నేను అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా 250 మందితో రూ.20లక్షల డిపాజిట్ చేయించాను. రూ.10వేల లోపు ఉన్న వారికి 48 మందికిగాను 45 మందికి ఇచ్చారు. రూ.20 వేల లోపు ఎవ్వరికీ ఇవ్వలేదు. నాతో పాటు 20 మంది ఏజెంట్లు రూ.25లక్షల డిపాజిట్ చేయించారు. ఉషారాణి అనే ఏజెంట్ మూడు నెలల క్రితం ఆత్మహత్య చేసుకుంది. వారికి తెలుగురాదు. ఈ ఉద్యమం గురించి అర్థం చేసుకోలేకపోతున్నారు. బాధితులు ఒత్తిడి చేయటం వల్ల నేను ఇంట్లో ఉండకుండా అజ్ఞాతంలో ఉంటున్నాను. ఇప్పుడు డబ్బుల గురించి అధికారులను అడిగితే మీరు తమిళనాడు వారు... మీకు వర్తించదని అంటున్నారు. చిరునామా తమిళనాడు అయినా అకౌంట్‌లు ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరు పేటలో ఉన్నాయి. మాకు ఎందుకు ఇవ్వరు.

- ఆశాబేగం, తమిళనాడు

కేంద్రం జోక్యం చేసుకోవాలి

అగ్రిగోల్డ్ సమస్య 8 రాష్ట్రాల్లో ఉంది. కేంద్రం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలి. ఏపీలో, కర్ణాటకలో ఒకేసారి ఉద్యమం ప్రారంభించాం. ఆంధ్రవాళ్లు వెయ్యి కోట్ల రూపాయలు సాధించారు. కర్ణాటకలో 8.5 లక్షల మంది బాధితులు 2వేల కోట్ల రూపాయలు డిపాజిట్ చేశారు. బీజేపీ చెపుతున్నట్లు కర్ణాటకలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వమే ఉంది. కేంద్రం చొరవ తీసుకుంటే సమస్య పరిష్కారం అవుతుంది.

- కె.గురుమూర్తి-బళ్లారి

ఎన్సీడీసీ భవనాలకు శంకుస్థాపన

విశాలాంధ్ర-మంగళగిరి: మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర రాష్ట్రాలలో నూతనంగా నిర్మించనున్న నేషనల్ సెంటర్ ఫర్ డీసీజ్ కంట్రోల్ (ఎన్సీడీసీ-జాతీయ వ్యాధి నివారణ కేంద్రం) భవనాలకు కేంద్ర రసాయనాలు, ఎరువులు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సూఖ్ మాండవీయ మంగళవారం న్యూఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ వద్ద రూ.15.74 కోట్ల ప్రాథమిక అంచనా వ్యయంతో భవనాన్ని నిర్మించనున్నారు. బిల్డింగ్ నిర్మాణ పనులు చేపడుతున్న సీపీడబ్ల్యూడీ- విజయవాడకు రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి విడదల రజిని, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సీపీడబ్ల్యూడీ సీఈ కనకరాజు, సీపీడబ్ల్యూడీ ఈఈ కృష్ణ కిశోర్ పాల్గొన్నారు. దిల్లీలో కేంద్రమంత్రితో పాటు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అడిషనల్ సెక్రటరీ లవ్ అగర్వాల్, సెక్రటరీ హెల్త్ రాజేశ్ భూషణ్, డైరెక్టర్ ఎన్సీడీసీ డాక్టర్ సుజీత్ కె.సింగ్ ఉన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ మహాసభలు

రాజమహేంద్రవరంలో నవంబరు 26 నుంచి 28 వరకు

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు వెల్లడి

రాజమహేంద్రవరం-విశాలాంధ్ర: చారిత్రక నగరం రాజమహేంద్రవరంలో నవంబర్ 26, 27, 28 తేదీలలో భవన నిర్మాణకార్మిక సంఘం జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక అంబల్ల సూర్యరావు భవన్‌లో జాతీయ మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం యూనియన్ జిల్లా కన్వీనర్ పీఎస్ నారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓబులేసు మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని సంక్షేమ బోర్డులో ఉన్న నిధులన్నీ ఇతర పథకాలకు మళ్లిస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఉద్యమాల పురిటిగడ్డ రాజమహేంద్రవరంలో జరిగే జాతీయ జాతీయ మహాసభల్లో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. ఈ మహాసభల విజయవంతానికి కార్మికులతో పాటు ప్రజలు, ప్రజాసంఘాలు, వర్తక, వాణిజ్య సంఘాలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఇసుకను ఇతర

రాష్ట్రాలకు తరలిస్తూ దోచుకు తింటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక పాలసీని రద్దుచేసి ప్రజలందరికీ ఇసుక అందుబాటులో ఉండే విధంగా చూడాలని సూచించారు. సెస్ రూపంలో వసూలు చేసిన సొమ్మును నవరత్న పథకాలకు వాడటం ఆపి, కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. ఈ జాతీయ మహాసభలకు సుమారు 29 రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి బీవీవీ కొండలరావు మాట్లాడుతూ... నిర్మాణరంగానికి అవసరమైన ఇసుక, సిమెంట్ స్టీల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ తదితర సామాగ్రిపై అధిక ధరలను నియంత్రించాలని, గడపగడపకు వస్తున్న ప్రజాప్రతినిధులను సంక్షేమ బోర్డుపై ప్రశ్నించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునర్ ప్రారంభించేందుకు భవన నిర్మాణ కార్మిక సంఘాలు ఏకం అవ్వాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల సీపీఐ కార్యదర్శులు తాటిపాక మధు, కే సత్తిబాబు, కామిరెడ్డి బోడకొండ, ఉమ్మడి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ్రపు రాంబాబు, ఐఎల్ నాయకులు ముప్పాళ్ల సుబ్బారావు, జట్ల యూనియన్ కార్యదర్శి సప్ప రమణ, సీపీఐ నగర కార్యదర్శి వంగమూడి కొండలరావు, నాలం వెంకటేశ్వరరావు, కలిసేట్టి నాయుడు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి: అర్హులైన లబ్ధిదారులందరికీ నేతన్న నేస్తం పథకం వర్తింపజే యాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. నేతన్న నేస్తం పథకంలో భాగంగా అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం గ్రామం సచివాలయం-1లో అర్హులైన 179 లబ్ధిదారుల ఖాతాలకు రూ.24 వేలు జమకాకపోవడం అన్యాయమని, తక్షణమే లబ్ధిదారుల ఖాతాలలో సంబంధిత నగదును జమ చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గజవల్లి వెంకటకృష్ణారావు, బత్తూరి మోహన్ రావు, దొడ్డి ఈశ్వరరావులతో కలిసి ఎర్రబాలెంలోని జౌళి శాఖ కార్యాలయంలో హ్యాండ్లూమ్ అడిషనల్ కమిషనర్ శ్రీకాంత్ ప్రభాకర్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతపురం జిల్లా పెదపప్పూరు గ్రామంలో 179 లబ్ధిదారులకు గత మూడు సంవత్సరాలుగా వస్తున్న నేతన్న నేస్తం ఈ సంవత్సరం రాలేదని కమిషనర్‌కు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ... జీపీఎస్‌లో సాంకేతిక సమస్య వల్లే ఇలా జరిగిందని, వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారని నాగేశ్వరరావు తెలిపారు.

పేర్లు మార్చి... రిబ్బన్ కటింగా!

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఇతరుల కష్టానికి పేర్లు మార్చి రిబ్బన్ కటింగ్ చేయడానికి జగన్ రెడ్డి సిగ్గుపడాలని టీడీపీ సీనియర్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శించారు. ఆన్‌లైన్ ద్వారా మంగళ వారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంగం బ్యారేజీకి చంద్రబాబు నాయుడు 82.86 శాతం పనులు పూర్తి చేస్తే, జగన్ రెడ్డి 20 శాతం పనులను కూడా పూర్తి చేయలేకపోయారని దుయ్య బట్టారు. ఏపీలో జలవనరుల శాఖ నిద్రావస్థలో ఉంద న్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతో ప్రాజెక్టులన్నీ నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. 2008లో ప్రారంభమైన సంగం బ్యారెజ్ ప్రాజెక్ట్ 2014 దాకా ఒక్క అడుగు ముందుకు వేయలేదన్నారు. 2015లో చంద్రబాబు నాయుడు ప్రాజెక్టులో మార్పులు, చేర్పులతో పనులు ముమ్మరం చేసి 82.86 శాతం పూర్తయ్యేలా కృషి చేశారన్నారు. నెల్లూరు బ్యారేజ్, సంగం బ్యారేజ్‌కి సంబంధించి కేవలం 18.20 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయనీ, మూడున్నరేళ్లల్లో కేవలం 20 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. 2020 నవంబరు 11న జరిగిన సమీక్షా సమావేశంలో నెల్లూరు, సంగం బ్యారేజీలను 2021 జనవరిలో ప్రారంభించాలని ఆర్భాటంగా జగన్ రెడ్డి చెప్పారనీ... మూడేళ్లుగా ప్రాజెక్ట్‌లపై సీత కన్నేసి, ఇప్పుడేమో రిబ్బన్ కటింగ్ చేస్తు గొప్పలు చెబుతున్నారని దుయ్యబట్టారు. రెక్కల కష్టం చంద్రబాబు నాయుడుది అయితే రిబ్బన్ కటింగ్ జగన్ రెడ్డిదని ఎద్దేవా చేశారు. రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపన చేసి కాంట్రాక్టర్లను మార్చి వైసీపీ నేతలు కమీషన్లు దండుకుంటు న్నారని గోరంట్ల ఆరోపించారు. రాయలసీమలో కృష్ణా జలాలు వృధాగా సముద్రంలోకి పోతున్నా దారి మళ్లించలేక పోయారని పేర్కొన్నారు. సరైన నిర్వహణ, మరమ్మత్తులు లేకపోవడంతో అనేక ప్రాజెక్టులు దెబ్బ తింటున్నాయన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లకు మరమ్మత్తు చేయనందున నీరంతా సముద్రం పాలైందన్నారు. పులిచింతల గేట్ల పరిస్థితి ఇదే విధంగా ఉందని చెప్పారు. అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకుపోతే నిర్వాసితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. నెల్లూరు బ్యారేజికి రూ.91 కోట్లు, సంగం బ్యారేజికి రూ.64 కోట్లు ఖర్చు చేయలేకపోయారన్నారు. జగన్ రెడ్డి ఈడీ కేసుల నుంచి బయటపడాలనే ఆరాటంతో రాష్ట్ర ప్రయోజనాలపై ఏమాత్రం శ్రద్ధ చూపించడం లేదని విమర్శించారు. తెలంగాణలోని తన సొంత ఆస్తులను కాపాడుకోవడం కోసం ఏపీ నీటి హక్కులన్నింటిని పొరుగు రాష్ట్రానికి దారాదత్తం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలో ఉండగా రూ. 55 వేల కోట్లు పోలవరానికి అవసరం లేదని తప్పుడు ఆరోపణలు చేశారు... నేడు అదే రూ. 55 వేల కోట్ల కోసం కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు జలవనరుల ప్రాజెక్టుల కోసం 5 ఏళ్లల్లో 68,293 కోట్లు ఖర్చు చేసి 62 ప్రాజెక్టుల పనులు పరుగులు తీయించి 23 ప్రాజెక్టులను పూర్తి చేసి 32.02 లక్షల ఎకరాలకు ఆయకట్టు స్థిరీకరణ, 7 లక్షల ఎకరాలకు నూతన ఆయకట్టు అందిస్తే, జగన్ రెడ్డి జల వనరుల ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి చోద్యం చూస్తున్నారని గోరంట్ల విమర్శించారు.

ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు

దసరా ఉత్సవాల ఏర్పాట్లు వేగవంతం

దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 20వ తేదీ నుంచి ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మవారి ఆలయం సహా రాష్ట్రంలోని 9 ప్రధాన దేవాలయాల్లో ఆన్‌లైన్ సేవలను ప్రవేశపెట్టనున్నట్లు ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. విజయవాడలోని మంత్రిత్వశాఖ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశం వివరాలను మంగళవారం మంత్రి మీడియా ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రంలో ప్రధాన దేవాలయాలైన కాణిపాకం, కాళహస్తి, శ్రీశైలం, విజయవాడ దుర్గమ్మ దేవాలయం, అన్నవరం, పెనుగ్రంచిపోలు, ద్వారకాతిరుమల, సింహాచలం, విశాఖ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం, వాడపల్లి, అయినవిల్లి దేవాలయాలలో ఈ నెల 20వ తేదీ నుంచి ఆన్ లైన్ సౌకర్యాలు ప్రారంభిస్తామని వివరించారు. భక్తులు రద్దీ అధికంగా ఉండే మరో 10 దేవాలయాలలో కూడా ఆన్ లైన్ సౌకర్యాలు కల్పించాలని భావిస్తున్నామన్నారు. దేవాదాయశాఖలో పదోన్నతులపై కసరత్తు జరుగుతోందని, ఇప్పటికే ముగ్గురికి డీసీ లుగా పదోన్నతులు కల్పించామన్నారు. అక్టోబర్ 10న ధార్మిక పరిషత్ తొలి సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. ట్రిబ్యునల్‌లోని పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

విజయవాడ కనకదుర్గమ్మ వారి ఆలయంలో దసరా ఉత్సవాలకి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. సామాన్య భక్తులకి ఇబ్బందిలేకుండా వీఐపీల కోసం ప్రత్యేక టైం స్లాట్‌ని కేటాయిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ను ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు. వీఐపీ భక్తుల కోసం మొత్తం 5 స్లాట్లు (ఉదయం 3 గంటల నుంచి 5 గంటల వరకూ, సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ, 10 గంటల నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకూ, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు) కేటాయించినట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకూ ప్రత్యేక స్లాట్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. సాధారణ భక్తులు తెల్లవారుఝామున 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిరంతరాయంగా దర్శనాలకి అవకాశం కల్పిస్తామన్నారు. దసరా ఉత్సవాల్లో రోజుకి 70 వేల మంది భక్తులు వస్తారని భావిస్తున్నామని, మూలా నక్షత్రం రోజున రెండు లక్షల మంది భక్తులు అమ్మవారి రావచ్చని అంచనావేస్తున్నట్లు తెలిపారు. మూలా నక్షత్రం రోజున ఎలాంటి ప్రతిపాదన లేఖలు, దర్శనం కోసం టైం స్లాట్‌లు పనిచేయవన్నారు. భవానీ మాల ధారణ భక్తులకు టీటీడీ కల్యాణ మండపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. స్నానాల కోసం కేశఖండన శాల వద్ద గతంలో 300 షవర్ లు ఉంటే వాటిని 700కి పెంచామని తెలిపారు. పబ్లిక్ టాయిలెట్లు 150 నుంచి 300కి పెంచామన్నారు. సీసీ కేమేరాలు గతంలో ఉన్న 220 నుంచి 300లకి పెంచుతున్నామని తెలిపారు. ప్రసాదం కౌంటర్ల సంఖ్యను రెట్టింపు చేశామన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా సునాయాసంగా అమ్మవారి దర్శనం కలిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు.

అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-వీరులపాడు: ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామంలో మంగళవారం అప్పుల బాధ తాళలేక ఓ రైతు పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన బొజ్జ విజయ్ శేఖర్ (46) అనే రైతు నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న, రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. మొక్కజొన్న పంట పూర్తిగా ఎండిపోవడం, అప్పులుతీర్చే మార్గం లేకపోవడంతో పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన మెరుగైన చికిత్స నిమిత్తం అతడిని విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. అప్పుల బాధలు భరించలేకే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు.

ప్రజా ఉద్యమమే శరణ్యం

572వ రోజుకు విశాఖ ఉక్కు రిలే దీక్షలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించేలా ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచేందుకు స్టీల్ ప్లాంట్‌లోని అన్ని కార్మిక సంఘాల నాయకులు ఐక్యంగా తమ శక్తివంచన లేకుండా కృషి చేయవలసిన తరుణం ఆసన్నమైందని పోరాట కమిటీ నాయకుడు డీ ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు మంగళవారం 572వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ దోపిడీలను, అవినీతిని ప్రశ్నించే వారిని నిర్బంధాలకు గురిచేస్తూ తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని మండిపడ్డారు. మంత్రి రాజశేఖర్, జె. అయోధ్య రామ్, వరసాల శ్రీనివాసరావు, వై.మస్తాన్‌అప్ప, కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడారు. నాయకులు బీఎంవీ రమణ, బి.అప్పారావు, పీవీ రమణమూర్తి, పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు పీ బాబు, ముత్యాలనాయుడు, సుబ్బయ్య, కోరాడ వెంకట్రావు, మరిడయ్యా, సాయి ప్రసాద్, జగదీష్ బాబు పాల్గొన్నారు.

సంపాదకీయం

కీలక దశలో భారత్ జోడో యాత్ర

కేంద్రంలో మోదీ నాయకత్వంలో ఎనిమిదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశంలో విద్వేషం నింపుతూ జనాన్ని నిట్ట నిలువునా చీలుస్తున్న దశలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం నుంచి భారత్ జోడో యాత్ర ప్రారంభిస్తున్నారు. దీని వల్ల కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందా ప్రజల మధ్య ఐక్యత పెంచడానికి ఉపకరిస్తుందా లేదా అన్నవి ప్రస్తుతానికి విషయాంత రాలే. దక్షిణాన చివరి కొసన ఉన్న కన్యా కుమారి నుంచి మొదలై 12 రాష్ట్రాల గుండా ఈ యాత్ర కశ్మీర్ దాకా సాగుతుంది. అయితే త్వరలో ఎన్నికలు జరగవలసి ఉన్న రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ ద్వారా యాత్ర సాగకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించే లోపమే. ఈ యాత్రలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అనేకమంది పౌర సమాజ కార్య కర్తలు పాల్గొంటారంటున్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో 1930లో జరిగిన దండి యాత్ర, మాజీ ప్రధానమంత్రి చంద్రశేఖర్ భారత్ యాత్ర కూడా ఈ సందర్భంగా తప్పకుండా గుర్తుకొస్తాయి. దండి యాత్ర అమెరికాలో పౌర హక్కుల కోసం పోరాడిన మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, జేమ్స్ లెవెల్ లాంటివారిని ప్రభావితం చేసింది. కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వలసలు పెరిగిపోతూ, సొంత పార్టీలోనే అంతర్గత కలహాలు చెలరేగుతున్న స్థితిలో రాహుల్ భారత్ జోడో యాత్ర ఏ మేరకు ఆ పార్టీని సంఘటిత పరుస్తుందో చూడాలి. అయితే విద్వేష రాజకీయాల దుష్పరిణామాలను జనం దృష్టికి తీసుకు రావడం మాత్రం ఖాయం. మూడేళ్లకు పైగా కాంగ్రెస్‌కు పూర్తి కాలం పని చేసే అధ్యక్షులు ఎవరూ లేరు. అక్టోబర్‌లో జరిగే ఎ.ఐ.సి.సి. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరగొచ్చు. 3,570 కిలోమీటర్ల మేర అయిదు నెలల పాటు జరిగే ఈ యాత్ర బీజేపీ వ్యతిరేక శక్తులను ఎంతవరకు సమీకరించ గలుగుతుందో కూడా యాత్ర పూర్తి అయితే తప్ప నిర్ధారణకు రాలేం. ఈ యాత్ర ప్రారంభించేది రాహుల్ గాంధీయే అయినా ఇది అందరికీ సంబంధించిందని చెప్తున్నారు. శశి థరూర్ మాటల్లో చెప్పాలంటే ఈ యాత్ర భారత్ ఆత్మను పునరావిష్కరించడానికి జరుగుతున్న ప్రయత్నమే. ఈ ప్రయత్నం యాత్ర ముగిసిన తరవాత కూడా కొనసాగించాల్సిందే. రాహుల్ యాత్ర పార్టీని ఐక్యం చేయడానికీ ఉపకరిస్తుందని థరూర్ అంటున్నారు. ఈ యాత్ర కాంగ్రెస్ మౌలిక సూత్రాలను ఆకళింపు చేసుకుని కొనసాగించడానికి ప్రయత్నించగలిగితే ప్రజాస్వామ్యానికి మేలే జరగవచ్చు. ఇది పరస్పర విరుద్ధ సిద్ధాంతాల మధ్య సంఘర్షణ అని కూడా రాహుల్ అంటున్నారు. ఈ యాత్ర కోసం ప్రత్యేకంగా "ఏక్ తేరా కదం, ఏక్ మేరా కదం, మిల్ జాయే, జుడ్ జాయే అప్న వతన్" అని ఒక పాట సిద్ధం చేశారు. ఈ యాత్ర ఎవరు నిర్వహిస్తున్నారు, ఎవరి ఆధ్వర్యంలో జరుగుతోంది అన్నది ప్రధానం కాదు. మోదీ సర్కారు రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్న దశలో ఈ విచ్ఛిన్నకర ధోరణి గురించి ప్రజలను చైతన్యవంతుల్ని చేయడం, స్ఫూర్తి కలిగించడమే ముఖ్యం. మోదీ హయాంలో రైతులకు, దళితులకు, ఆదివాసులకు, మహిళలకు, మతపరమైన మైనారిటీలకు దేశ భవిష్యత్తు నిర్మాణంలో ఎలాంటి పాత్రా ఉండడం లేదు. మోదీ హయాంలో మత విద్వేషాలే కాదు. ఆర్థిక వ్యత్యాసాలు, రాష్ట్రాల హక్కులను కేంద్రం కబళించడం లాంటివి ఎక్కువైనాయి. ప్రజలలో గూడుకట్టుకున్న భయాలను, అభిప్రాయాలను ఢిల్లీ పీఠాధిపతులకు తెలియజెప్పాలన్న లక్ష్యమే ప్రధానమైంది. అదే సమయంలో జనాభిప్రాయం వినడానికి ఇది మహదవకాశం. యాత్ర చేపడుతున్నది రాహుల్ గాంధీయే అయినా ఇతర రాజకీయ పార్టీలను, రాజకీయాలకు దూరంగా ఉంటున్న వారిని, పౌర సమాజ కార్యకర్తలను సమీకరించడంవల్ల ఒక స్పష్టమైన సంకేతం ప్రజలకు అందుతుంది. మెజారిటీ మతస్థుల ఆధిపత్యం కొనసాగడం ప్రమాదకరం.

స్వాతంత్ర్యానికి ముందూ మహాత్మా గాంధీ 1930లో నిర్వహించిన దండి యాత్రతో మొదలుకుని అనేక యాత్రలు జరిగాయి. తెలుగు నేలలోనే 1937లో కొమ్మారెడ్డి సత్యనారాయణ, కమ్యూనిస్టు నాయకుడు చలసాని వాసుదేవ రావు నాయకత్వంలో శ్రీకాకుళంలోని ఇచ్ఛాపురం నుంచి మద్రాసు దాకా 1572 మైళ్ల దూరం రైతు యాత్ర సాగింది. జమీందారీ విధానం రద్దుకోసం జరిగిన ఈ యాత్ర ప్రారంభించింది. ఎంతమంది అన్న దానితో నిమిత్తం లేకుండా యాత్ర సాగిన కాలంలో దాదాపు నాలుగున్నర లక్షల మంది భుజం భుజం కలిపి నడిచారు. 2011లో తమిళనాడులో కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలోనే సుదీర్ఘ యాత్ర జరిగింది. కమ్యూనిస్టు పార్టీలో ఉన్నప్పుడు యువ నాయకుడు కన్హయ కుమార్ సైతం రాజ్యాంగ పరిరక్షణ కోసం యాత్ర నిర్వహించారు. పాదయాత్రే 2004లో వై.ఎస్.రాజశేఖర రెడ్డిని అధికారంలోకి తీసుకురావడానికి దోహద పడింది. చరిత్ర పొడవునా ఇంకా అనేక యాత్రలు జరిగాయి. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేస్తానని ప్రకటించిన తరవాతే ఆయనను అపఖ్యాతి పాలు చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ అయిదు రోజుల పాటు ప్రశ్నించింది. సోనియా గాంధీని కూడా ఇలాగే ప్రశ్నించారు. కచ్చితంగా వారిని ఇరుకున పెట్టడానికి పన్నాగమే. మాజీ ప్రధానమంత్రి చంద్రశేఖర్ 1983 జనవరి 6 నుంచి 1983 జూన్ 25 దాకా నిర్వహించిన భారత్ యాత్రలో ఎక్కడికక్కడ జనం పాల్గొనడంవల్ల అది అవిచ్ఛిన్నమైన ఊరేగింపుగా మారిపోయింది. జన చైతన్యానికి ఇలాంటి కార్యక్రమాలు తప్పనిసరిగా ఉపయోగపడతాయి. రాజకీయ పార్టీ అంటే నాయకులు, పార్టీ కార్యాలయాలు, తద్వారా సమకూరే ఆస్తులే కాదు ప్రజలు ప్రధానం అన్న సంకేతం ఇవ్వడానికి ఈ యాత్రలు తోడ్పడతాయి.

తక్షణం భూ పంపిణీ జరగాలి

బొల్లిముంత సాంబశివరావు

బ్రిటిష్ వలస పాలన కాలం నుంచే ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటాలు ప్రారంభమైనాయి. 1943 కేరళలో కయ్యూరు రైతుల తిరుగుబాటు, 1946 నిజాం నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, పున్నప్ర వాయలార్ ఉద్యమం, 1948 బెంగాల్ తెభాగ రైతాంగ పోరాటం, మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ రైతుల ఆందోళనతో పాటు అనేక రైతాంగ ఉద్యమాలు జరిగాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూములు పేదలు స్వాధీనం చేసుకున్నారు. భూ పోరాటాలు దేశంలోని అనేక ప్రాంతాలకు విస్తరించాయి.

రైతాంగ ఉద్యమాల ఫలితంగా ముఖ్యంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఫలితంగా నెహ్రూ ప్రభుత్వం జమిందారీ విధానాన్ని రద్దు చేసింది. 1950లో కాంగ్రెస్ ప్రభుత్వం భూ పరిమితి విధానాలు ముందుకు తెచ్చింది. మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలో భూములకు గరిష్ఠ పరిమితి విధిస్తానని చెప్పి ఐదేళ్ళ తర్వాత మూడు కుటుంబాల పరిధి పరిమితిగా విధించింది. ఇలాంటి సీలింగ్ వలన పేదలకు భూ పంపిణీ జరగలేదు. 1954లో మరలా చట్టానికి సవరణలు చేసి ఒక్కో కుటుంబానికి 27 నుండి 108 ఎకరాల మాగాణి, 164 ఎకరాల నుండి 324 ఎకరాల మెట్ట భూములను గరిష్ట పరిమితిగా విధించింది. చట్ట సవరణలు ముందుగానే భూస్వాములకు పాలకులు చేరవేయటం వలన వారు జాగ్రత్తపడి భూములు కాపాడుకున్నారు. ఫలితంగా పేదలకు భూములు దక్కలేదు. పేదల భూ పోరాటాలు కొనసాగుతూనే ఉన్న నేపథ్యంలో 1958లో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త భూ పరిమితి ముసాయిదాను ప్రవేశపెట్టి 1961లో దాన్ని చట్టంగా మార్చింది. ఈ చట్ట నిబంధనల సమాచారం కూడా ముందుగానే భూస్వాములకు చేరటం వలన వివిధ మార్గాల ద్వారా చట్ట పరిధిలోకి రాకుండా భూములు కాపాడుకున్నారు.

భూ పోరాటాలు తిరిగి ఉధృతం కావటంతో భూ పరిమితిని మరోసారి కుదిస్తూ 1970 మే 25న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ 10 ఎకరాల మాగాణి, 25 ఎకరాల మెట్టగా భూ పరిమితి 1 పేర్కొంది. 1973లో ఆ ఆర్డినెన్స్ అసెంబ్లీలో ఆమోదం పొంది చట్టంగా మారింది. అసెంబ్లీ ఆమోదం పొందినా 1975 జన వరిలోగాని అమల్లోకి రాలేదు. రాష్ట్రంలో మూడు కోట్ల ఎకరాల భూములు ఉంటే 6.47 లక్షల ఎకరాల మిగులు భూమిని ప్రభుత్వం ప్రకటించింది. భూ పరిమితి చట్టం ద్వారా మొదట 18 లక్షలకు పైగా మిగులు భూములు ఉన్నట్లు ప్రకటించిన ప్రభుత్వం అనేకసార్లు దాన్ని కుదిస్తూ చివరికి 6.47 లక్షల ఎకరాలుగా పేర్కొంది. అందులో 5.82 లక్షల ఎకరాలను 4.79 మందికి పంపిణీ చేసినట్లు చెప్పింది. భూ సీలింగ్ ద్వారా స్వాధీనం చేసుకున్న భూస్వాముల భూములు వేళ్ళ మీద లెక్కించవచ్చు. దీన్ని గమనిస్తే భూ పరిమితిలోకి రాకుండా చట్ట లొసుగులను ఉపయోగించుకుని భూస్వా ములు భూములు కాపాడుకున్నారు. పేదలకు పంచామని చెబుతున్న భూములు కూడా సంఘ నిర్మాణం ద్వారా పేదలు సాధించు కున్నవే 90% ఉన్నాయి. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో భూ పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజలు పంట భూమిని కోరుకుంటున్నారు. భూ సంస్కరణల చట్టాల అమలు తీరు వల్ల భూస్వామ్య వర్గాలకు ఎటు వంటి నష్టం కలగలేదు. వారి భూములు యథాతథంగా వారి కుటుంబ సభ్యుల వద్దనే ఉన్నాయి. భూ సంబంధాల్లో మౌలిక మార్పులు చోటు చేసుకోలేదు. భూ కేంద్రీకరణ తగ్గలేదు. భూమి లేని పేదల సంఖ్య పెరుగుతూనే ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వా ముల పట్టు కొనసాగుతూనే ఉంది. భారతీయ గ్రామీణ అభివృద్ధి నివేదిక 1992 ప్రకారం దేశ గ్రామీణ జనాభాలో సగానికి పైగా అసలు భూమే లేదు. జాతీయ నమూన సర్వే ప్రకారం (2003-04) 41.63% కుటుంబాలకు ఇంటి స్థలం తప్ప సొంత భూమి లేదు. నామ మాత్రంగా భూమి ఉన్నవారు మూడింట ఒక వంతు ఉన్నారు. 20 శాతం మందికి హెక్టార్ కంటే తక్కువ భూమి ఉంది. ముఖ్యంగా దేశ జనాభాలోని 60 శాతానికి మొత్తం భూమిలో 5% మాత్రమే భూమి ఉంటే, పది శాతం మంది చేతుల్లో 55% పైగా ఉంది. ఈ లెక్కలను గమనిస్తే భూమి కేంద్రీకృతమైన తీరు, భూమి లేని పేదల సంఖ్య, అర్ధ భూస్వామ్య వ్యవస్థ కొనసాగుతున్న విధానాన్ని తెలియచేస్తున్నది. భూ పంపిణీ జరిగి ఉంటే 50% భూమి లేని పేదలు ఎలా ఉంటారు. కౌలు సేద్యం ఉందంటేనే భూస్వామ్య విధానం కొనసాగుతున్నదని అర్థం. దేశంలో 50% పైగా, ఆంధ్రప్రదేశ్‌లో 60% పైగా కౌలు సేద్యం కొనసాగు తున్నది. కౌలు విధానం భూస్వామ్య వ్యవస్థ అంతర్భాగం. భూస్వామ్య దోపిడీకి ముఖ్యమైనది. భూస్వామ్య వర్గంతో సామ్రాజ్యవాదం, బడా బూర్జువా వర్గం మిలాఖత్ కావటం వలన వ్యవసాయ రంగంలో సహజంగానే కొన్ని మార్పులు వచ్చాయి. పంటల మార్కెటింగ్, కుటుంబ అవసరాల కోసం మిగులు ఉత్పత్తి, సేద్యంలో యంత్రాల వినియోగం అందులో భాగమే. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు భూస్వామ్య వర్గ ప్రయోజనాలు కాపాడుతూ, సామ్రాజ్యవాద, కార్పోరేట్ సంస్థల ఎరువుల, పురుగు మందుల, విత్తనాల వ్యాపారానికి, ట్రాక్టర్ల, కోత మిషన్ల మెదలైన వాటి వ్యాపారానికి నిలయంగా ఉన్నాయి. మార్కెట్ విధానం ఇప్పుడు కొత్తగా రాలేదు. 1952 నుంచి పండిన ధాన్యంలో కొంత భాగాన్ని రైతులు కుటుంబ అవసరాల కోసం వ్యాపారులకు అమ్మేవారు. దేశం పారిశ్రామికంగా వెనకబడి ఉంది. వ్యవసాయంలో వచ్చిన మార్పుల ద్వారా సేద్యాన్ని సంక్షోభం లోకి నెట్టి కార్పొరేట్ సంస్థలకు చిన్న, సన్నకారు రైతుల భూములు కట్టబెట్టే విధానాలు పాలకులు అనుసరిస్తున్నారు. ఫ్యూడల్ సంస్కృతి వికృత రూపంలో కొనసాగుతున్నది. మత ప్రచారాలు, దైవత్వం, యజ్ఞాలు, మూఢ నమ్మకాలు, మఠాధిపతులు, స్వాములు, అతీత శక్తులు, పాములను, చెట్లను పూజించటం నేడు పెద్ద ఎత్తున కొనసాగు తున్నది. ఈ సంస్కృతిని పాలకులు పెంచి పోషిస్తున్నారు. విప్లవాత్మక భూ సంస్కరణలకై ప్రజలు ఉద్యమించి, నూతన ప్రజాతంత్ర వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి.

వ్యాస రచయిత సెల్ 9885983526

భజన చేస్తే పౌష్టికాహారం లభిస్తుందా..!

డా. ముచ్చుకోట సురేష్ బాబు

మన్ కీ బాత్ 92 వ ధారావాహికంలో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడుతూ పౌష్టికాహార లోపాన్ని జయించడానికి దేశంలో ప్రజలు భజనలు చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో పిల్లలకు మూడు పూటల తిండి లేక దీనస్థితిలో కడు పేదరికంలో బతుకీడుస్తున్న కుటుంబాలు కోకొల్లలు. కేంద్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నామని గొప్పగా ప్రచారం చేస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల్లో పోషకాహార లోపం సమస్య ఉంది కానీ ఈ సమస్య తీవ్రత మన దేశంలో అధికంగా ఉంది. ఉండవలసిన బరువుకంటే తక్కువ బరువు వున్న పిల్లలు 40 శాతం ఇండియాలోనే ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ప్రతి ఏటా మన దేశంలో సగం వరకూ శిశు మరణాలు పౌష్టికాహార లోపంవల్లే సంభవిస్తున్నాయి. మహిళల్లో కూడా పౌష్టికాహార లోపం సమస్య తీవ్రంగా ఉండి, 56 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు సర్వేలు తలియజేశాయి. దీనికి కారణం పేదరికం, నిరక్షరాస్యత, ఎక్కువ వున్న కుటుంబాల పిల్లల్లో పౌష్టికాహారం లోపాలు ఎక్కువగా ఉన్నాయి. పౌష్టికాహార లోపాలను సరిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్, గర్భిణుల, బాలల ఆరోగ్య కార్యక్రమాలు చేపడుతున్నాయి. కానీ ఫలితం అంతంత మాత్రమే. మన దేశంలో 1982 నుంచి పౌష్టికాహార వారోత్సవాలు జరుపు కుంటున్నాము. యూనెసెఫ్ 2022 నివేదిక ప్రకారం పౌష్టికాహార లోపంతో 6 నుంచి 36 నెలల్లోపు పిల్లలు 47 శాతం మంది ఉండగా, 6 నుంచి 8 నెలల్లోపు 52 శాతం మంది పిల్లలు చనిపోతున్నారు. 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 33.23 లక్షల మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని పోషక ట్రాక్ యాప్‌లో పొందుపరచిన సమాచారం. గర్భస్థ శిశువుతో పాటు తల్లుల మరణాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. మూడు పూటలు పిల్లలకు సరిపడ తిండిలేక న్యూమోనియాతో బాధపడుతూ 28.9శాతం పిల్లలు ప్రతి ఏటా చనిపోతున్నారు. గర్భిణులు పౌష్టికాహార లోపంతో శరీరంలో కాల్షియం, ఐరన్ లోపం వల్ల ప్రసవం కాకుండానే 32శాతం మంది చనిపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా మన రాష్ట్రంలో రూపాయికే కిలో బియ్యం పంపిణీ చేస్తున్నామని, దీనివల్ల ఆకలి చావులను నివారించవచ్చునని ప్రభుత్వం చెబుతున్నది. కానీ రూపాయి కిలో బియ్యం పంపిణీ చేసినప్పటికీ వాటికి తోడు నిత్యావసర వస్తువులు అందుబాటులో లేవు. 49 శాతం కుటుంబాలకు మూడు పూటల తిండి దొరకడం లేదని సమాచారం. ఒకవేళ దొరికిన అన్నం కారంపొడి వేసుకొని తింటున్నారని పలు అధ్యయన నివేదికల్లో బయటపడింది. అంగన్ వాడీ కేంద్రాల్లో కూడా పిల్లలకు సరైన పోషక విలువలున్న ఆహారం అందించడం లేదని తేలింది. చాలావరకూ అంగన్ వాడీ కేంద్రాలు పెద్దగా నడవడం లేదని, ఈ కేంద్రాలకు సరఫరా చేసే ఆహారంలో నాణ్యత లేదని పలువురు ఆరోపించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో మితిమీరిన అవినీతి ఉండడం వల్ల గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందక మృత్యువాత పడుతున్నారని తెలిసింది. ఇదిలా ఉండగా ఆకలిచావులు, వలసల నివారణకు యూపిఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని 2005 సంవత్సరంలో ప్రవేశపెట్టింది. ఈ పథకం వల్ల 100 రోజుల పనులతో పేదరిక నిర్మూలనను రూపుమాపడం సాధ్యమా! 100 రోజులు పని కల్పించినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మిగతా 100 రోజులు ఖాళీగా ఉండే పరిస్థితులున్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పండకపోవడంతో గ్రామీణ కూలీలకు పనులు దొరకడం లేదు. దీంతో మరింత పేదరికంలో వెళ్లుతున్నట్లు పలు అధ్యయన సంస్థలు వెల్లడించాయి. దీన్నిబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ పథకాలు పేదరిక నిర్మూలనకు పెద్దగా ఉపయోగకరంగా లేవని అర్థమౌతుంది. దీంతో ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనకు మెరుగైన ఉపాధి అవకాశాలతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని పలువురు నిపుణులు చెబుతున్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనేది అక్షరసత్యం. ఆరోగ్యవంతమైన ప్రజలు ఉన్నపుడే ఆరోగ్యవంతమైన సమాజం, రాష్ట్రం, దేశం ఉంటుంది. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారమే ప్రధాన పాత్ర పోషిస్తోంది. పోషకాహారం, ఆహారం ఈ రెండూ కవల పిల్లల వంటివి. శరీరం విధులు నిర్వహించేందుకు కావాల్సిన శక్తిని అందిస్తూ ఎదుగుదలకు, ఆరోగ్యంగా ఉండటానికి, రోగాలతో పోరాడటానికి అవసరమైన శక్తిని అందించేదే నిజమైన పోషకాహారం. ఎదిగే వయసులో తగినంత పోషకాహారం లభించకపోతే ఆ ప్రభావం జీవితాంతం ఉంటుంది. పిల్లల్లో శరీర పెరుగుదల చాలా ఎక్కువగా ఉంటుంది కనుక వారి ఆహారం పట్ల శ్రద్ధపెట్టాలి. పోషకాహార లోపం గల పిల్లలకు రెట్టింపు ఆహారం ఇవ్వాలి. మన పిల్లలు పోషకాహార లోపం లేకుండా ఉన్నప్పుడే మన దేశం మంచి ఆరోగ్యకరమైన దేశంగా అభివృద్ధి చెందుతుంది. బడికి వెళ్ళే వయసు కంటే ముందున్న శైశవ దశలోనే పిల్లలు ఎక్కువగా పోషకాహార లోపం, అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి. వీరిలో పోషకాహార లేమి అంటు వ్యాధులను ఆకర్షిస్తాయి. పోషకాహార లోపం ఉన్నపుడు అంటురోగాల తీవ్రత ఎక్కువ. పోషకాహార లోపం వల్ల పల్లెల్లో ఎక్కువగా డయేరియా, శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశాలుంటాయి. అంతేగాక పోషకాహార లోపం వల్ల రక్తహీనత, పొంగు, ఆటలమ్మ మొదలైన అంటువ్యాధుల బారిన పిల్లలు పడతారు. శరీరానికి కావాల్సిన పోషకాలు, పిండి పదార్థాలు, మాంసకృతులు, కొవ్వు, విటమిన్లు, ఖనిజ లవణాలు- వీటితోపాటు శరీరానికి స్వచ్ఛమైన నీరు కూడా ఎంతో అవసరం. ఈ పోషకాలన్నింటిని సరైన పరిమాణంలో శరీరానికి అందించే ఆహారమే సమతుల ఆహారం లేక సంపూర్ణ ఆహారం. బియ్యం, గోధుమలు, జొన్నలు, రాగులు, నూనె మొదలగునవి శక్తినిచ్చే ఆహార పదార్థాలైతే, పప్పుధాన్యాలు, సోయా చిక్కుడు, పాలు, మాంసం, గుడ్లు, మొదలగునవి పెరుగుదలకు తోడ్పడే ఆహార పదార్థాలు. ఆకుకూరలు, పండ్లు మొదలగునవి శరీర రక్షణకు తోడ్పడే ఆహార పదార్థాలు.

భారత ప్రభుత్వం సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు పోషకాహార వారోత్సవాలు నిర్వహిస్తోంది. 'మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యానికి పునాది'- సమతుల ఆహారాన్ని తీసుకోలేని స్థితే పోషకాహార లోపానికి దారితీస్తుంది. పోషకాహార లోపం కేవలం ఆరోగ్యపరమైన సమస్య మాత్రమే కాదు వ్యక్తి, కుటుంబం, సమాజంపైనా ఇది విస్తృత దుష్ప్రభావాన్ని చూపుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ఈ లోపాలు అధికోత్పత్తిని దెబ్బతీసి పేదరికాన్ని పెంచుతుంది. ప్రతి రోజు సమతుల ఆహారం అందితేనే ప్రజలు ఆరోగ్యంగా ఉన్నట్లు. పోషకాహార లోపం లోపిస్తే ప్రజల జీవన ప్రమాణాలు క్షీణిస్తాయి.

వ్యాస రచయిత ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

ఇ-మెయిల్

విశ్వాస తీర్మానాల సీజన్

దేశంలో ఇప్పుడు విశ్వాస తీర్మానాల సీజన్ నడుస్తున్నట్టుంది, బీజేపీయేతర పార్టీ పాలిత రాష్ట్రాల్లో వారం క్రితం దిల్లీలో ఆప్ సర్కారు విశ్వాస తీర్మానం పెట్టుకుని నెగ్గింది. నిన్న జార్ఖండ్‌లో యూపీఏ సర్కారు కూడా అదే బాట పట్టింది. రెండు చోట్లా అధికారంలో ఉన్న బీజేపీ వ్యతిరేక పక్షాలు తమ తమ పార్టీల్లో కేంద్రప్రాయోజిత చీలికల్ని నివారించడానికి ఈ మార్గాన్ని ఎన్నుకున్నాయి. ప్రమాద బీమా, జీవిత బీమాల కోసం ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకొని అదనపు ప్రీమియం కట్టుకున్నట్టు. ప్రజల విశ్వాసం పొంది పూర్తి మెజారిటీతో ఐదేళ్ల కోసం

వారి నుండి లైఫ్ గ్యారెంటీ పొందిన పార్టీలు, మళ్లీ మధ్య మధ్యలో ఇలా విశ్వాస తీర్మానాల ద్వారా గ్యారంటీలు పొందాల్సి రావడం విడ్డూరం. కేంద్రంలో అధికారం ఉన్న పార్టీ తనకు అస్మదీయులు కాని పార్టీల్ని నిరంతరం అభద్రతా భావంలో ఉండేలా చూడడం అంటే అది అనైతికం. పాలనకు విఘాతం. ప్రజాస్వామ్యానికి విషాదం. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. కారణాలేమైనా కావొచ్చు గాక ఈ స్థితి అభిలషణీయంకాదు. ఇకపోతే జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఈ విశ్వాస తీర్మానం ద్వారా బావుకున్నదేమీ లేదు. మరికొన్నాళ్లు తన పార్టీ మెజారిటీ నిలుపుకోవడం తప్ప. ఒకవేళ ఎలక్షన్ కమిషన్ ఆయన్ని లాభదాయక పదవుల విషయంలో అనర్హత వేటు వేస్తే మళ్లీ ఆట మొదలవడం ఖాయం.

– డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ, 9440836931.

వాస్తవాల వక్రీకరణ, కమ్యూనిస్టు వ్యతిరేకత!

సత్య

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఇందు మల్హోత్రా వివాదాస్పద వ్యాఖ్యలతో కూడిన వీడియో వైరల్‌గా మారిందంటూ దాని గురించి మీడియాలో ప్రముఖంగా గత నెల చివరి వారంలో వార్తలు వచ్చాయి. దీనిపై వివరణ ఇవ్వాలని మీడియా సంస్థలు కోరగా ఆమె నుంచి ఎలాంటి స్పందన లేదు. ఆ మహిళను ఇందు మల్హోత్రాగానే భావించిన కేరళ ప్రభుత్వం ఆమె మాట్లాడిన తీరును తప్పు పట్టింది. ఇందు మల్హోత్రాను కొందరు తప్పుదారి పట్టించి ఉంటారు, వాస్తవాలను సరి చూసుకొని ఆమె మాట్లాడి ఉండాల్సిందని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి కెటి థామస్ అన్నారు. ఆమె మాట్లాడిందాన్లో తప్పు లేదని బీజేపీ, దాని అభిమానులు సమర్థించారు. ఆమె తీరు ఆందోళన కలిగిస్తోందని అనేకమంది సామాజిక మాధ్యమంలో స్పందించారు. ఇందు మల్హోత్రా వీడియో అధికారికమైనది కాదు, అందులో ఆమె మాస్క్ ధరించి ఉన్నారు, ఆమె వివరణ తీసుకొనేందుకు ఫోన్, వర్తమానం, మెయిల్ ద్వారా ప్రయత్నించగా ఫలించలేదని "ద ఫెడరల్" న్యూస్ పోర్టల్, వివరణ రాలేదని టెలిగ్రాఫ్ పత్రిక పేర్కొన్నది.

ఇంతకీ ఆమె చేసిన వ్యాఖ్యలేమిటి? గత నెల 28న ఆమె తిరువనంతపురం పద్మనాభ స్వామి దేవాలయాన్ని సందర్శించినప్పుడు భక్తులలో ఒకరు ఆలయం వెలుపల ఆమెతో మాట్లాడుతూ పద్మనాభస్వామి ఆలయ కేసులో మంచి తీర్పు ఇచ్చారని ప్రశంసించారు. దీనిపై మాట్లాడిన ఆమె "ఈ కమ్యూనిస్టు ప్రభుత్వాలతో జరుగుతున్నది అదే. కేవలం దేవాలయాలకు వస్తున్న ఆదాయం కారణంగానే వారు దేవాలయాలను స్వాధీనం చేసుకోవాలనుకుంటున్నారు. అన్ని చోట్లా వారు స్వాధీనం చేసుకున్నారు. అన్నిచోట్లా, కేవలం హిందూ దేవాలయాలనే. కాబట్టే జస్టిస్ యుయు లలిత్, నేను కుదరదని చెప్పాం, మేం దాన్ని అనుమతించం. మేం అడ్డుకోకుండా ఉండి ఉంటే ఇంకా కొనసాగేవి" అని మాట్లాడినట్లుగా వీడియోలో ఉంది. మీ గురించి మేం ఎంతో గర్విస్తున్నాం, మీరు అలాంటి అద్భుతమైన పని చేశారు అన్న కొందరి మాటలు కూడా సదరు వీడియోలో ఉన్నాయి. పద్మనాభ స్వామి దేవాలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని 2011లో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దేవాలయం తమ నిర్వహణలోనే కొనసాగాలన్న పూర్వపు రాజవంశీకుల అప్పీలుపై 2020 జూలై 13న జస్టిస్ యుయు లలిత్, ఇందు మల్హోత్రాలతో కూడిన బెంచ్ వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. 2021 మార్చి 13న ఇందు మల్హోత్రా పదవీ విరమణ చేయగా జస్టిస్ లలిత్ ప్రస్తుతం సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సంగతి తెలిసిందే.

నిజంగా కేరళ ప్రభుత్వం దేవాలయాలను స్వాధీనం చేసుకోవాలనుకున్నదా? 2007లో ఆనంద పద్మనాభన్ అనే లాయరు రాజకుటుంబ వారసత్వ హక్కులను సవాలు చేస్తూ తిరువనంతపురం కోర్టులో కేసు దాఖలు

చేశారు. ఆలయ ఆస్తుల పరిరక్షణకు కొత్త ట్రస్టీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఆలయం, ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. శతాబ్దాలుగా ఉన్న తమ హక్కును రద్దు చేసేందుకు లేదంటూ రాజకుటుంబం హైకోర్టుకు అప్పీలు చేసింది. 1950నాటి చట్టంలోని ఒక సెక్షన్ ప్రకారం సంస్థాన విలీన ఒప్పందంలో గుర్తించిన చివరి రాజు 1991లో మరణించిన తరవాత వారసులు స్వతఃసిద్ధంగా ఆలయ నిర్వహణ హక్కులను పొందలేరని అందువలన ప్రభుత్వం వెంటనే ఆలయ స్వాధీనానికి కొత్త ట్రస్టును లేదా చట్టపరమైన అథారిటీని ఏర్పాటు చేయాలని హైకోర్టు తీర్పునిచ్చింది. దీని మీద రాజు, నాటి ఆలయ అధికారి సుప్రీంకోర్టులో విడిగా అప్పీలు చేశారు. పద్మనాభ స్వామి దేవస్థానాన్ని స్వాధీనం చేసుకొనే ఆలోచన తమకు లేదని, ప్రస్తుత యాజమాన్యం గురించి ఎలాంటి ఫిర్యాదులు లేవని ప్రభుత్వం (ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్) తిరువనంతపురం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. (2010 మార్చి 16, హిందూ పత్రిక). 1949లో కేంద్ర ప్రభుత్వం-తిరువాన్కూర్-కొచ్చిన్ సంస్థానం చేసుకున్న విలీన ఒప్పందంలో రాజు వారసులు దేవాలయ యాజమాన్యంలో కొనసాగవచ్చనే నిబంధన ఉంది. సుప్రీంకోర్టు దాన్ని గుర్తించి ఆ మేరకు తీర్పు ఇచ్చింది. 1950 చట్టం ప్రకారం కేరళలోని దేవాలయాలన్నీ దేవస్థానాల బోర్డుల అజమాయిషీల కిందకు వచ్చినప్పటికీ సంస్థాల విలీన ఒప్పందం ప్రకారం పద్మనాభ స్వామి ఆలయం మాత్రం రాజు వారసుల నిర్వహణలోనే ఉంటుందని పేర్కొన్నారు. కార్యనిర్వహణ అధికారిని, ముగ్గురు సలహాదారులను కూడా నియమించే అధికారం ఉంది. 1965లో రాజు మేనేజింగ్ ట్రస్టీగా, నలుగురు సభ్యులతో పద్మనాభ స్వామి ఆలయ ట్రస్టును ఏర్పాటు చేశారు.

హైకోర్టు తీర్పును కొట్టేసిన సుప్రీంకోర్టు రాజకుటుంబం విధానపరమైన నిర్ణయాలు తీసుకొనేందుకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. ముగ్గురితో సలహా కమిటీ ఏర్పాటు, దానికి అధ్యక్షత వహించేందుకు రిటైర్డ్ హైకోర్టు జడ్జి, రాజు నియమించిన ఒక ప్రముఖ వ్యక్తి, రాజుతో సంప్రదించి అధ్యక్షుడు నియమించే చార్టెడ్ ఎకౌంటెంట్ ఉండాలి. ఆలయపాలనకు ఐదుగురితో ఒక కమిటీ, దానిలో రాజు వారసుల అదుపు, పర్యవేక్షణకు లోబడి పని చేసే విధంగా జిల్లా జడ్జి, రాజు ప్రతినిధి, ప్రధాన పూజారి, కేంద్ర, రాష్ట్ర ప్రతినిధులు ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఈ తీర్పును సవాలు చేయరాదని సిపిఎం నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నిర్ణయించింది.

హిందూ దేవాలయాలను కమ్యూనిస్టు ప్రభుత్వం దోచుకుంటున్నదని చేస్తున్న ప్రచారం అబద్ధమని గతంలో అనేకసార్లు వెల్లడైంది. అక్కడ ఐదేళ్ళు యుడిఎఫ్ (కాంగ్రెస్) అధికారంలో ఉంటే మరో ఐదు సంవత్సరాలు ఎల్‌డిఎఫ్ (సీపీఎం) ఉన్న చరిత్ర తెలిసిందే. తొలిసారిగా వరుసగా రెండవ సారి గతేడాది ఎల్‌డిఎఫ్ అధికారానికి వచ్చి చరిత్ర సృష్టించింది. 2014 ఏప్రిల్ 22న కాంగ్రెస్ ఎమ్మెల్యే విటి బలరాం బీజేపీ నేత ఎఎన్ రాధాకృష్ణన్‌కు సమాధానమిస్తూ ఫేస్‌బుక్‌లో పేర్కొన్న సమాచారం ప్రకారం మలబార్ దేవస్థానం బోర్డుకు అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం వేతనాల కోసం రు.22 కోట్లు చెల్లించింది. పద్మనాభ స్వామి దేవాలయానికి రాష్ట్ర ప్రభుత్వం 1970 నుంచి ఏటా రూ.20 లక్షలు చెల్లిస్తున్నది. 2011 నుంచి 2014 వరకు శబరిమల ఆలయం రూ. 60 కోట్లు పొందింది. 2015 డిసెంబరు ఏడున కేరళ అసెంబ్లీకి నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన సమాధానం ఇలా ఉంది. "శబరిమలతో సహా వివిధ ఆలయాలకు వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ ఖర్చుల కోసం ఖజానాకు జమ చేస్తున్నారన్నది ఆధారం లేని ఆరోపణ. తిరువాన్కూర్, కొచ్చిన్, మలబార్, గురువాయుర్ దేవస్థానం బోర్డుల పరిధిలోని ఆలయాల ఆదాయం నేరుగా వాటి బ్యాంకు ఖాతాలకే జమ అవుతుంది. తిరువాన్కూర్, కొచ్చిన్ బోర్డుల లావాదేవీలను హైకోర్టు నేరుగా నియమించే ఆడిటర్లే తనిఖీ చేస్తారు, ఇతర వాటిని లోకల్ ఫండ్ డిపార్ట్‌మెంట్లు తనిఖీ చేస్తాయి. ఆ నివేదికలను ఎవరైనా చూడవచ్చు. 2011 నుంచి 2015 వరకు ప్రభుత్వ నిధుల నుంచి వివిధ ఆలయాలకు రూ.231 కోట్లు ఖర్చు చేసింది." గత నెల 29న అసెంబ్లీలో చర్చకు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చేస్తున్న ఖర్చు, ఇతర అంశాల గురించి ప్రభుత్వం వివరాలను ఇచ్చింది. దేవస్థానాల మంత్రి కె రాధాకృష్ణన్ ఇచ్చిన సమాచారం మేరకు కరోనాతో ఏర్పడిన సంక్షోభాన్ని అధిగమించేందుకు గత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వివిధ దేవాలయాలకు రు.165 కోట్లు ఇచ్చింది. ఈ ఏడాది జులై 31 వరకు తిరువాన్కూర్ బోర్డుకు 20 కోట్లు, మలబార్ బోర్డుకు రూ.44 లక్షలు ఇచ్చింది." ఇదీ అసలు వాస్తవం. మితవాద హిందూత్వ శక్తులు పదేపదే చేసిన ప్రచారం రిటైర్డ్ న్యాయమూర్తిని ప్రభావితం చేసి ఉండవచ్చు. ప్రభుత్వం ఏ దేవాలయాన్నీ స్వాధీనం చేసుకోలేదు. 2018 నుంచి 2022 వరకు ఐదేండ్లలో వివిధ బోర్డులకు కరోనా, వరదలపుడు ఆదుకొనేందుకు రూ.449 కోట్లు ప్రభుత్వం ఇచ్చిందని, 30 కోట్లతో శబరిమల మాస్టర్ ప్లాన్ అమలుకు పూనుకున్నదని, రిటైర్డ్ న్యాయమూర్తి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని రాధాకృష్ణన్ మీడియాకు చెప్పారు.

'భారత్ జోడో యాత్ర'కు మద్దతివ్వండి

ప్రజలకు 200కి పైగా పౌర సమాజం సభ్యుల పిలుపు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ 'భారత్ జోడో యాత్ర'కి మద్దతు తెలియజేయాలని 200 మందికి పైగా పౌర సమాజం సభ్యులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారతదేశ ప్రజాస్వామ్యం, ఐక్యత పై 'క్రమబద్ధమైన దాడి' నుంచి రక్షించడానికి మరే ఇతర సంస్థ ఇటువంటి కార్యక్రమం చేపట్టినా మద్దతు తెలపాలని అభ్యర్థించారు. 150 రోజుల కాంగ్రెస్ 'భారత్ జోడో యాత్ర' సెప్టెంబర్ 7న ప్రారంభం కానున్నది. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ అతిపెద్ద కార్యక్రమంలో భాగంగా దాదాపు 3,500 కిలోమీటర్ల మేర ప్రజలను కలుసుకోనున్నది. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సాగే ఈ యాత్రలో పార్టీ నేత రాహుల్ గాంధీ పాల్గొంటారు. 'భారతదేశం ఆలోచనే 'క్రమబద్ధమైన దాడి కిందకు వచ్చినప్పుడు, ప్రజాస్వామ్య ప్రమాణాలు నిర్మొహమాటంగా అణగదొక్కబడుతున్నప్పుడు, రాజ్యాంగ విలువలు లేని కాలంలో ప్రజల మనస్సాక్షిని కదిలించడమే పాదయాత్ర లక్ష్యం' అని పౌర సమాజం సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'మన గణతంత్ర విలువలు ఈ మధ్యకాలంలో ఎదుర్కొన్నంత దారుణమైన దాడిని మునుపెన్నడూ ఎదుర్కోలేదు. ఇంతకు ముందెన్నడూ ఇలాంటి మనపై ద్వేషం, విభజన, బహిష్కరణ పురివిప్పలేదు. దేశం భవిష్యత్తును రూపొందించడంలో సమర్థవంతమైన అధిక సంఖ్యలో రైతులు, కార్మికులు, దళితులు, ఆదివాసీలు, మహిళలు, మతపరమైన మైనారిటీలు ఇంత ప్రభావవంతమైన బహిష్కరణను ఇంతకు ముందెన్నడూ ఎదుర్కోలేదు. ఈ తీవ్రమైన జాతీయ సంక్షోభం' నేపథ్యంలో 'భారత్ జోడో యాత్ర' జరగనున్నదని వారు తెలిపారు. 'స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం మార్గదర్శక దీపాలుగా ఉన్న సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ఉన్న భారతదేశాన్ని తిరిగి పొందాలనే ప్రతిజ్ఞను పునరుద్ధరించే దిశగా మనమందరం భారత్ జోడో యాత్రను నిర్ణయాత్మక దశగా చేద్దాం' అని పిలుపునిచ్చారు. ఈ విజ్ఞప్తి పై సంతకం చేసిన వారిలో స్వరాజ్ ఇండియా వ్యవస్థాపకుడు యోగేంద్ర యాదవ్, డాక్యుమెంట్ సినిమా రూపకర్త ఆనంద్ పట్వర్ధన్, ఆల్ ఇండియా సెక్యులర్ ఫ్రంట్‌కు చెందిన అనిల్ సద్గోపాల్, హక్కుల కార్యకర్త అంజలి భరద్వాజ్, థియేటర్ రూపకర్త అనురాధ కపూర్, ప్రముఖ జర్నలిస్ట్ మృణాల్ పాండే, మాజీ ఎంపీ ధరమ్‌వీర్ గాంధీ, ఐఏఎస్ మాజీ అధికారులు అభిజిత్ సేన్‌గుప్తా, సుజాతా రావు తదితరులు ఉన్నారు. 'ఈ గొప్ప నాగరికత పట్ల గర్వించే, మన దేశానికి గొప్ప భవిష్యత్తును విశ్వసించే ప్రతి భారతీయుడు ఈ భారత్ జోడో యాత్రకు మద్దతు ఇవ్వాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాము. అధికారంలో ఉన్న పార్టీతో సంబంధం లేకుండా ఏ ప్రభుత్వం చేసిన అన్యాయమైన చర్యలకు వ్యతిరేకంగా, ప్రతిఘటించడంలో ప్రజా ఉద్యమాలకు స్థిరమైన రికార్డు ఉందని, అలాగే కొనసాగుతుందని వారు నొక్కి చెప్పారు. భారత్ జోడో యాత్ర వంటి ప్రయత్నానికి ఒకసారి మద్దతు ఇవ్వడంలో ఒక రాజకీయ పార్టీ లేదా ఒక రాజకీయ నాయకుడితో ముడిపడి ఉండదని పేర్కొన్నారు. 'ఈ యాత్రతో మా మద్దతు వ్యక్తులుగా, గ్రూపులుగా, ఒక పార్టీగా అనేక రూపాలుగా ఉండవచ్చు. మేము భాగస్వామ్య కార్యక్రమాలు రూపొందించడం, అలాగే ప్రదర్శకులుగా పాల్గొనడం, సృజనాత్మక కళాకారులు లేదా మేథావులు, విద్యావేత్తలుగా, తోటి ప్రయాణికులుగా ఈ యాత్రలో చేరవచ్చు' అని పౌర సమాజ సభ్యులు తెలిపారు.

తరలిరండి: ప్రియాంక

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ బుధవారం నుంచి 150 రోజుల పాటు ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'భారత్ జోడో యాత్ర'లో ప్రజలంతా పాల్గొనాలని, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి ప్రజా ప్రాధాన్యత కలిగిన అంశాలపై ఏకతాటిపైకి రావాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా పిలుపునిచ్చారు. తాము ఆశాహవ రాజకీయాలు ప్రారంభిస్తున్నామని, మీ సమస్యలు తెలుసుకోవాలని, పరిష్కరించాలని కోరుకుంటున్నామని ప్రియాంక పేర్కొన్నారు. భారత్‌ను ఐక్యంగా ఉంచాలని అభిలషిస్తున్నామని, ఐక్యభారతాన్ని సాధిద్దామని ఫేస్‌బుక్ వీడియోలో ప్రియాంక అన్నారు. ప్రజలు, వారి సమస్యలను ఏమాత్రం ఖాతరు చేయని రాజకీయాలు ఇప్పుడు నడుస్తున్నామని ప్రియాంక విమర్శించారు. 'ఇవాళ రాజకీయ చర్చలన్నీ దేశ ప్రజల సమస్యలు ఏమాత్రం పట్టించుకోని రీతిలో సాగుతున్నాయి. భారత్ జోడో యాత్ర ద్వారా సామాన్య ప్రజానీకం సమస్యలు, ఆందోళనలను తెలుసుకుంటాం' అని ఆమె అన్నారు. దేశ సౌభాగ్యం కోసం ప్రజలంతా ఏకమై యాత్రలో పాల్గొనాలని కోరారు. భారత్ జోడో యాత్ర ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్న హిమాచల్‌ప్రదేశ్ సహా 12 రాష్ట్రాల మీదుగా వెళ్తుంది.

బీఎస్ఎఫ్ దళాలపై పాక్ రేంజర్ల కాల్పులు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీరు వెంబడి అంతర్జాతీయ సరిహద్దుల్లో పాకిస్తాన్ రేంజర్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారు. కాల్పులకు తెగబడ్డారు. సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) సిబ్బందిపై ఎటువంటి హెచ్చరికలు లేకుండా మంగళవారం ఉదయం కాల్పులు జరిపారు. బీఎస్ఎఫ్ సిబ్బంది కూడా దీటుగా స్పందించి, పాక్ రేంజర్లకు జవాబిచ్చారు. బీఎస్ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్‌పీఎస్ సంధు మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం పాకిస్తాన్ రేంజర్లు జమ్మూ జిల్లాలోని అర్నియా సెక్టర్‌లో గస్తీ తిరుగుతున్న బీఎస్ఎఫ్ సిబ్బందిపై కాల్పులకు తెగబడ్డారు. ఎటువంటి హెచ్చరికలు లేకుండా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అప్రమత్తంగా ఉన్న బీఎస్ఎఫ్ సిబ్బంది వెంటనే దీటుగా స్పందించారు. బీఎస్ఎఫ్ జమ్మూ ప్రజా సంబంధాల అధికారి మాట్లాడుతూ ఈ సంఘటనలో భారత దేశంవైపు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. జమ్మూకశ్మీరు వెంబడి అంతర్జాతీయ సరిహద్దుల్లో కాల్పుల విరమణను పునరుద్ధరించాలని 2020 ఫిబ్రవరిలో భారత్, పాకిస్తాన్ అంగీకారానికి వచ్చాయి. కొన్ని ఉల్లంఘనలు నమోదైనప్పటికీ సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు, రైతులు కొంత ఉపశమనం పొందగలిగారు. నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి వ్యవసాయ కార్యకలాపాలను మళ్లీ ప్రారంభించుకున్నారు.

ప్రధాని పదవి ఖాళీగా లేదు: బీజేపీ

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి పదవి ఖాళీగా లేదని బీజేపీ వ్యాఖ్యానించింది. బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో సమావేశం కావడంపై బీజేపీ స్పందించింది. నితీశ్ కుమార్ బీహార్‌ను వేగంగా అభివృద్ధి చేసి ఉంటే అనేక మంది బీహారీ యువతీయువకులకు ఉద్యోగావకాశాలు లభించి ఉండేవని పేర్కొంది. నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ నెల క్రితం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే నుంచి బయటకు వచ్చి, ఆర్జేడీ, కాంగ్రెస్‌లతో కలిసి బీహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నితీశ్ వివిధ ప్రతిపక్ష పార్టీల నేతలతో సమావేశమవుతున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా నితీశ్ కుమార్ నిలిచే అవకాశం ఉందని ఊహాగానాలు చెలరేగుతున్నాయి. అయితే నితీశ్ ఆ ప్రచారాన్ని తోసిపుచ్చుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ మంగళవారం ట్విటర్ వేదికగా స్పందిస్తూ నితీశ్ కుమార్ ప్రధానమంత్రి పదవిపై దృష్టి పెట్టి ఉండవచ్చునని, అయితే ఆ పదవి ఖాళీగా లేదని చెప్పారు. నితీశ్ తన సొంత, వ్యక్తిగత ఆకాంక్షల కోసం కృషి చేస్తున్నట్లుగానే, బీహార్ అభివృద్ధిపై దృష్టి పెట్టి ఉంటే, ఆ రాష్ట్రానికి చెందిన చాలామంది యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు లభించి ఉండేవని చెప్పారు. కాంగ్రెస్ రహిత రాజకీయాల వాదనను మొట్టమొదట వినిపించిన రామ్ మనోహర్ లోహియా శిష్యుడు కదా మీరు అని నితీశ్ కుమార్‌కు గుర్తు చేశారు. 'ఇప్పుడు మీరు ఎక్కడికి వెళ్లారు?' అని ప్రశ్నించారు. 'మీరు ఇప్పుడు ప్రతి తలుపు తడుతున్నారు. ఇది మీకు కొత్తేమీ కాదు. మీకన్నా ముందు ఇలా చాలామంది చేశారు, కానీ ఎటువంటి ఫలితం లేదు. ప్రధాన మంత్రి పదవి ఖాళీగా లేదు. చాలామంది ప్రతిపక్ష నేతలు వరుసలో ఉన్నారు. మీరు కూడా నిలబడండి' అని ఎద్దేవా చేశారు.

చరిత్ర, వారసత్వానికి మచ్చ: మొయిత్రా

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని రాజ్‌పథ్ పేరు మార్పు నిర్ణయంపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా మండిపడ్డారు. ఈ పేర్ల మార్పును వ్యతిరేకిస్తూ మంగళవారం ట్విటర్ వేదికగా ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. రాజ్‌పథ్ పేరును కర్తవ్యపథ్‌గా మార్చే అవకాశం ఉందని ఇటీవల కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. వలసపాలకుల గుర్తులన్నింటినీ చెరిపివేయాలని ప్రధాని అనేక ప్రసంగాల్లో ప్రస్తావించారు. దీంతో బ్రిటీష్ వలస పాలన కాలంలో లండన్‌లోని కింగ్స్‌వే మాదిరిగా నిర్మించిన రాజ్‌పథ్ పేరును కర్తవ్యపథ్‌గా మారుస్తున్నట్లు ప్రకటించింది.దీనిపై మహువా స్పందిస్తూ.. అసలు దేశంలో ఏం జరుగుతోంది. బీజేపీ మన చరిత్రను తిరిగి రాయాలనే పిచ్చితనంతో మన సంస్కృతిని, వారసత్వాన్ని పునరావృతం చేయడమే ఏకైక కర్తవ్యంగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. కొత్తగా నిర్మిస్తున్న ప్రధాని కార్యాలయానికి కింకర్తవ్యవిమూఢ (గందరగోళం, అయోమయం, పిచ్చితనం) మఠం అని పేరు పెడితే బాగుంటుందని ఎద్దేవా చేశారు. బెంగాల్‌లోని అత్యుత్తమమైన నాన్సెన్స్ స్టోరీస్‌లో ఒకటైన హజబరలను ప్రస్తావించారు. ఇది ఒక చిన్న పిల్లల నవలని, దీనిలోని ఒక పాత్ర ప్రతివారికీ, ప్రతివస్తువుకీ ఓ వింతైన పేరు పెడుతూ ఉంటుందని, అదేవిధంగా ప్రస్తుతం దిల్లీలో సెంట్రల్ విస్టా పేరుతో నిర్మిస్తున్న ప్రధాన కార్యాలయానికి కింకర్తవ్యవిమూఢ మఠం అని పెడతారని తాను భావిస్తున్నానని మొయిత్రా ట్విటర్‌లో ఎద్దేవా చేశారు.

విజయన్ మంత్రివర్గంలోకి మాజీ స్పీకర్

తిరువనంతపురం: సీపీఎం సీనియర్ నేత, మాజీ స్పీకర్ ఎంబీ రాజేశ్ (51) మంగళవారం ఎల్డీఎఫ్ ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన తర్వాత స్థానిక స్వపరిపాలన, ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉన్న ఎంవీ గోవిందన్ రాజీనామా చేశారు. ఆ స్థానంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ రాజేశ్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ఉదయం 11 గంటలకు రాజ్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో రాజేశ్‌తో మంత్రిగా ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన మంత్రివర్గ సహచరులు, రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ హాజరయ్యారు. పాలక్కాడ్ జిల్లా త్రిథాల నుండి మొదటిసారి ఎమ్మెల్యే అయిన రాజేశ్... పాలక్కాడ్ నియోజకవర్గం నుండి లోక్‌సభకు కూడా ప్రాతినిథ్యం వహించారు. రాజేశ్‌ను మంత్రిగా నియమిస్తూ అధికార సీపీఎం నిర్ణయం తీసుకోవడంతో స్పీకర్ పదవికి రాజేశ్ శనివారం రాజీనామా చేశారు. రాజేశ్ స్థానంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, తలస్సేరి ఎమ్మెల్యే ఎఎన్ శ్యాంసీర్ స్పీకర్‌గా నియమితులయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ సీనియర్ నాయకుడు కొడియేరి బాలకృష్ణన్ స్థానంలో వారం రోజుల క్రితం సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన గోవిందన్ మంత్రి పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో మంత్రివర్గంలో చిన్నపాటి పునర్వ్యవస్థీకరణ జరిగింది.

తృణమూల్ ఎమ్మెల్యేకు సీబీఐ సమన్లు

కోల్‌కతా: టీఎంసీకి చెందిన మరో ఎమ్మెల్యే పరేష్ పాల్‌కు సీబీఐ తాజాగా సమన్లు జారీ చేసింది. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి ఎమ్మెల్యే పరేష్ పాల్‌కు సీబీఐ సమన్లు జారీ చేసింది. ఈ వారంలోగా కోల్‌కతాలోని నిజాం ప్యాలెస్ సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఉత్తర కోల్‌కతాకు చెందిన అభిజిత్ సర్కార్ అనే బీజేపీ కార్యకర్త పోలింగ్ ఫలితాలు వెలువడిన రోజే హత్యకు గురయ్యాడు. బీజేపీ కార్యకర్తను టీఎంసీ వారే హత్య చేశారని మృతుడి కుటుంబసభ్యులు సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో తొలుత కోల్‌కతా పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. అనంతరం కోల్‌కత్తా హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు చేపట్టింది. ఘర్షణల్లో అనేకమంది పార్టీ కార్యకర్తలు మరణించడం, చాలామంది గాయపడటంతో పశ్చిమ బెంగాల్‌లో హింస చెలరేగింది. బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడంతో అప్పటి గవర్నర్ జగదీప్ ధన్కర్ రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి, డీజీపీ, కోల్‌కతా కమిషనర్‌లను పిలిపించి శాంతిభద్రతలు పునరుద్ధరించాలని ఆదేశించారు.

యూపీ ప్రభుత్వానికి సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ: లఖింపూర్‌ఖేరీ హింసాకాండకు సంబంధించిన కేసులో అరెస్టయిన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నుంచి స్పందన కోరింది. ఈ మేరకు నోటీసు జారీ చేసింది. పిటిషన్‌పై విచారణను సెప్టెంబరు 26కు వాయిదా వేసింది. అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ జులై 26న మిశ్రా బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆయన వేసిన పిటిషన్... న్యాయమూర్తులు ఇందిరా బెనర్జీ, ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది.

ప్రాథమిక వ్యవస్థను ఈడబ్ల్యూఎస్ కోటా ఉల్లంఘిస్తోందా?

కేంద్రానికి, రాష్ట్రాలకు రాజ్యాంగ ధర్మాసనం ప్రశ్న

న్యూఢిల్లీ: అధికరణలు 15, 16లను సవరించి రాజ్యాంగంలో ఆర్థిక రిజర్వేషన్‌ను తీసుకు వచ్చారు. తద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ క్లాజులు జోడించారు. ఆర్థిక పరిస్థితి ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే విషయమై సుప్రీంకోర్టులో లేవనెత్తిన అంశాలపై కేంద్రం, రాష్ట్రాలు, పిటిషనర్ల నుంచి స్పష్టతను రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం కోరింది. ప్రాథమిక వ్యవస్థను ఈడబ్ల్యూఎస్ కోటా ఉల్లంఘిస్తున్నదా? అని ప్రశ్నించింది. దేశంలోని అత్యంత పేద, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులను, ఎస్సీ, ఎస్టీలను కోటా పరిధి నుంచి మినహాయించడంపై సందేహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యా వ్యవస్థల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు 10శాతం కోటా కల్పించే రాజ్యాంగంలోని 103వ సవరణ చెల్లుబాటును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యూయూ లలిత్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం పరిగణనలోకి తీసుకున్నది. ధర్మాసనం పరిశీలించేందుకు న్యాయపరమైన అంశాల ముసాయిదాను కోర్టు ఆదేశాల మేరకు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణ రూపొందించారు. కేంద్రప్రభుత్వం, రాష్ట్రాలు, పిటిషనర్లు అధ్యయనం చేసేందుకు వీలుగా ఈ ముసాయిదా అంశాలను వారికి అందజేయాలని ధర్మాసనం సూచించింది. వాటి ఖరారునకు తదుపరి విచారణ గురువారం ఉంటుందని తెలిపింది. వచ్చే మంగళవారం నుంచి కేసును విచారిస్తామని సీజేఐ లలిత్ వెల్లడించారు. ఏడు రోజుల్లోగా ఇరుపక్షాల వాదనలు ముగియాలని కూడా ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

అనేక రాష్ట్రాల్లో అతి భారీవర్షాలు

వాతావరణ శాఖ హెచ్చరిక ఏపీకి భారీ వర్ష సూచన

న్యూఢిల్లీ: అల్పపీడన ప్రభావం వల్ల దేశంలోని అనేక రాష్ట్రాల్లో అతి భారీవర్షాలు కురుస్తాయని భారత వాతావరణశాఖ (ఐఎండీ) మంగళవారం వెల్లడించింది. రాగల మూడు రోజుల పాటు కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అతి భారీవర్షాలు కురవవచ్చని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చాలాచోట్ల వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ అధికారులు చెప్పారు. లక్షద్వీప్, తెలంగాణ, కోస్తా ఆంధ్రప్రదేశ్‌లలో 6,7,9 తేదీల్లో అతి భారీవర్షాలు కురుస్తాయని ఐఎండీ వివరించింది. కేరళ రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో వచ్చే 24 గంటల్లో 20 సెంటీమీటర్ల వర్ష పాతం నమోదయ్యే అవకాశముందని తెలిపింది. తిరువనంతపురం, కొల్లాం, పతనంతిట్ట, ఇడుక్కి జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆయా జిల్లాల్లో రెడ్ అలర్ట్ జారీ చేసింది. తిరువనంతపురంలో విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు. ఎర్నాకుళం, ఇడుక్కి, పాలక్కాడ్, మణప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్ జిల్లాల్లోనూ భారీవర్షాలు కురిశాయి. పాలోడిలోని మంకాయం జలపాతం వద్ద మెరుపు వరదల్లో చిక్కుకొని ఇద్దరు మరణించారు. తమిళనాడులోని నీలగిరి, మెట్టుపాలయం, ఉద్గమండలం ప్రాంతాల్లో భారీవర్షాల వల్ల కొండచరియలు విరిగిపడ్డాయి. కల్లార్ హిల్ గ్రోవ్ ప్రాంతాల్లో రైలు పట్టాలపై కొండచరియలు విరిగిపడి రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కర్ణాటక రాష్ట్రంలోనూ భారీవర్షాల వల్ల సిలికాన్ వ్యాలీగా పేరొందిన బెంగళూరులో లోతట్టుప్రాంతాలు నీటమునిగాయి.

జార్ఖండ్‌లో ఎమ్మెల్యేల ఇంటిబాట

రాంచీ: రాజకీయంగా ఆరురోజుల పాటు నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్న జార్ఖండ్‌లో అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో హేమంత్ సోరెన్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో నెగ్గడంతో సంక్షోభం సమసిపోయింది. దీంతో అధికార యూపీఏ ఎమ్మెల్యేలు ఇంటిబాట పట్టారు. సోరెన్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వాన్ని కూలదోయడానికి బీజేపీ... ఎమ్మెల్యేలతో బేరసారాలు నెరపుతున్న క్రమంలో సోరెన్... ఆగస్టు 30న కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్‌లోని రిసార్ట్‌కు సంకీర్ణ కూటమి ఎమ్మెల్యేలను తరలించారు. వీరంతా అసెంబ్లీ ప్రత్యేక సమావేశానికి హాజరయ్యేందుకు ఆదివారం సాయంత్రం రాంచీకి తిరిగి వచ్చి, ఇక్కడి సర్క్యూట్ హౌస్‌లో రాత్రి బస చేశారు. సోమవారం అసెంబ్లీలో విశ్వాస పరీక్షలో నెగ్గిన అనంతరం ఎమ్మెల్యేలు బస్సుల్లో సర్క్యూట్ హౌస్‌కు తరలివెళ్లి ముఖ్యమంత్రితో కలిసి భోజనం చేశారు. 'లంచ్ తర్వాత, మేము మా నివాసాలకు వెళ్లాము' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే దీపికా పాండే సింగ్ పీటీఐకి చెప్పారు. జేఎంఎం ఎమ్మెల్యే మధుర ప్రసాద్ మహతో, కాంగ్రెస్‌కి చెందిన శిల్పి నేహా టిర్కీ కూడా ఇదే విషయం తెలిపారు. మళ్లీ రాయ్‌పూర్‌కు వెళ్లే ఆలోచన ఏమైనా ఉందా అని అడగ్గా, అటువంటి పరిస్థితి రాబోదని టిర్కీ అన్నారు. గత నెల చివర్లో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం మొదలైంది. లాభదాయక పదవి కేసులో సోరెన్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ బీజేపీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఎన్నికల సంఘం (ఈసీ) తన నిర్ణయాన్ని ఆగస్టు 25 న గవర్నర్ రమేష్ బైస్‌కు పంపింది. ఈసీ నిర్ణయం ఇంకా బహిర్గతం కానప్పటికీ, ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రిపై అనర్హత వేటు వేయాలని ఈసీ సిఫార్సు చేసిందన్న వార్తలు గుప్పుమన్నాయి. ఈ తరుణంలో ఆగస్టు 28న యూపీఏ సభ్యులు ఒక సంయుక్త ప్రకటనలో... గవర్నర్ బైస్ ఈసీ నిర్ణయాన్ని ప్రకటించడంలో ఉద్దేశపూర్వకంగా జాప్యం వహిస్తున్నారని, తద్వారా రాజకీయ పందేరాన్ని ప్రోత్సహిస్తున్నారని నిశితంగా విమర్శించారు. ఈ అంశంపై సెప్టెంబరు 1న యూపీఏ ఎమ్మెల్యేలతో సమావేశం అనంతరం గవర్నర్ శుక్రవారం దిల్లీకి వెళ్లడంతో మరిన్ని ఊహాగానాలు చెలరేగాయి. అయితే గవర్నర్ వైద్య పరీక్షల కోసం వెళ్లారని, ఇది ఆయన వ్యక్తిగత పర్యటన అని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. కాగా బైస్ ఇంకా రాంచీకి తిరిగి రాలేదు.

10 లక్షల పాఠశాలల్ని అభివృద్ధి చేయాలి

ప్రధాని మోదీకి కేజ్రీవాల్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: దేశంలో ప్రభుత్వ పాఠశాలల్ని విడతల వారీగా మోడల్ స్కూళ్లుగా అభివృద్ధి చేస్తామన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటనపై దిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. విడతల వారీగా కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఒకేసారి ఆధునీకరించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ఆన్‌లైన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని తాజాగా ప్రకటించిన పీఎం శ్రీ యోజన పథకంలో దేశంలోని 10 లక్షల ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించడానికి 100 ఏళ్లు పడుతుందని విమర్శించారు. 14,500 పాఠశాలల్ని ఆధునీకరిస్తామన్న మోదీ నిర్ణయం... సముద్రంలో ఒక నీటి చుక్కతో సమానమన్నారు. అన్ని రాష్ట్రాలతో చర్చించి రానున్న 5ఏళ్ల కాలంలో 10 లక్షల ప్రభుత్వ పాఠశాలల్ని అభివృద్ధి చేయడానికి ఓ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ప్రతి పిల్లవాడికి నాణ్యమైన ఉచిత విద్య అందించకుండా భారత్, ప్రపంచంలో నం.1 దేశంగా ఎదగలేదని పేర్కొన్నారు. ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, లైబ్రరీలు, క్రీడా సౌకర్యాలతో సహా ఆధునిక మౌలిక సదుపాయాలతో 14,500 పాఠశాలలను మోడల్ స్కూల్‌లుగా అభివృద్ధి చేయడానికి పీఎం-శ్రీ యోజనను ప్రధాన మంత్రి సోమవారం ప్రకటించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రకటించిన ప్రధాని మోదీ... ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ) కింద అభివృద్ధి చేయబడిన పాఠశాలలు కొత్త జాతీయ విద్యా విధానంతో మోడల్ పాఠశాలలుగా మారతాయని అన్నారు.

రేషన్ కోసం బెంజి కారులో వచ్చిన 'పేదవాడు'

చండీగఢ్: పేద ప్రజల కోసం ప్రభుత్వాలు అందించే రేషన్ పంపిణీలో జరిగే అవకతవకలు మరోసారి బయటికొచ్చాయి. ఓ వ్యక్తి రేషన్ దుకాణంలో సరుకులు తీసుకునేందుకు ఏకంగా బెంజి కారులో వచ్చిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పంజాబ్‌లోని హోషియార్‌పుర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. హోషియార్‌పుర్‌లోని ఓ ప్రభుత్వ రేషన్ దుకాణం ముందు ఓ లగ్జరీ మెర్సిడెస్ బెంజ్ కారు వచ్చి ఆగింది. అందులో నుంచి ఓ వ్యక్తి దిగి నేరుగా రేషన్ దుకాణంలోకి వెళ్లాడు. తన బీపీఎల్ కార్డు చూపించి సరుకులు తీసుకున్నాడు. ఆ తర్వాత ఆ సంచులను కారు డిక్కీలో పెట్టించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ వ్యక్తి రేషన్ దుకాణం నుంచి కారులో సరుకులు తీసుకెళుతోన్న వీడియోను కొందరు సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంతో ఇది కాస్తా తీవ్ర దుమారం రేపింది. ఆ రేషన్ దుకాణాన్ని అమిత్ కుమార్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నారు. ఈ వీడియో వైరల్ అవడంతో స్థానిక మీడియా విలేకరులు అమిత్‌ను ప్రశ్నించారు. అయితే ఆ వ్యక్తికి బీపీఎల్ కార్డు ఉందని, తాను కేవలం ఆ కార్డును పరిశీలించిన తర్వాతే రేషన్ ఇచ్చానని తెలిపారు. అతడు కారులో వచ్చిన విషయం తనకు తెలియదన్నారు. ఈ వీడియో కాస్తా తీవ్ర వివాదానికి దారితీయడంతో ఆ బెంజి కారులో వచ్చిన వ్యక్తి స్పందించాడు. ఆ కారు తమ బంధువులదని, వారు విదేశాలకు వెళ్లడంతో కారును తమ ఇంటి ముందు పార్క్‌చేసి వెళ్లారని చెప్పాడు. అందుకే అప్పుడప్పుడు ఆ కారును తాను ఉపయోగిస్తున్నానని తెలిపాడు. తాను పేద వ్యక్తినేనని, డబ్బుల్లేక తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపిస్తున్నట్లు చెప్పాడు.

సీఎంలే సీట్ బెల్ట్ పెట్టుకోరు

కేంద్రమంత్రి గడ్కరీ అసహనం

న్యూఢిల్లీ: ప్రజల సహకారం లేకుండా రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చేసే ప్రయత్నాలు ఫలించవని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించారు. చివరకు ముఖ్యమంత్రులు సైతం సీట్ బెల్ట్ వంటి భద్రతా నియమాలు పాటించరని అసహనం వ్యక్తం చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త సైరస్ మిస్త్రీ రోడ్డు ప్రమాదంలో మరణించిన నేపథ్యంలో సీట్ బెల్ట్ ప్రాముఖ్యత గురించి ప్రముఖులు, నిపుణులు ప్రస్తావిస్తున్నారు. 'వెనక సీట్లలో కూర్చునే ప్రయాణికులు సీట్ బెల్ట్ పెట్టుకోవాల్సిన పనిలేదని అనుకుంటారు. ఇక్కడ నేను ఏ రోడ్డు ప్రమాదం గురించి ప్రస్తావించడం లేదు. కానీ ముందు, వెనక సీట్లలో కూర్చొన్న ప్రతి ఒక్కరు సీట్ బెల్ట్ పెట్టుకోవాల్సిందే. సామాన్యుల గురించి వదిలేయండి. నేను చాలామంది ముఖ్యమంత్రులతో కారులో ప్రయాణించిన సందర్భాలున్నాయి. వారి పేర్లు అడగొద్దు. వారితో ప్రయాణించేప్పుడు నేను ముందు సీట్‌లో కూర్చున్నాను. ఆ సమయంలో వారు కారు భద్రతా నియమాలు పాటించలేదు. ఒకవేళ మనం బెల్ట్ పెట్టుకోకపోతే అలారం మోగుతుంది. కానీ డ్రైవర్లు క్లిప్ పెట్టి అలారం ఆపేవారు. ఇక్కడ మనకు సహకారం ఉంటేనే ప్రమాదాలు ఆగుతాయి' అని ఓ సదస్సులో మాట్లాడుతూ గడ్కరీ వెల్లడించారు. కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రిగా గడ్కరీ.. కార్లకు ఆరు ఎయిర్‌బ్యాగులు తప్పనిసరి చేసే ప్రక్రియలో ఉన్నారు. ఒక్కో ఎయిర్ బ్యాగు నిమిత్తం అదనంగా ఖర్చవుతుంది. దీంతో కార్ల ధరలు పెరుగుతాయని, కొనుగోళ్లు తగ్గుతాయని తయారీదారులు అంటున్నారు. 'విదేశాల్లో ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. భారత్‌లోని పేదల ప్రాణాలకు విలువ లేదా..?' అని పరిశ్రమ వర్గాల అభిప్రాయాన్ని గడ్కరీ తోసిపుచ్చారు. మరోవైపు, దేశంలో రోడ్డు ప్రమాదాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా 2021లో రోడ్డు ప్రమాదాల కారణంగా ఏకంగా 1.55లక్షల మంది దుర్మరణం చెందారు.

వరద సమీక్షలో నిద్రపోతున్న మంత్రి

బెంగళూరు: అకాల వర్షాలతో బెంగళూరు అతలాకుతలమైంది. దీనిపై కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై నేతృత్వంలో మంగళవారం వరద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో మంత్రి ఆర్.అశోక్ నిద్రపోయారు. ఆ ఘటనకు సంబంధించిన ఫొటోలను కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్‌లో షేర్ చేస్తూ విమర్శల దాడికి దిగింది. రాష్ట్ర ప్రజలు భారీ వర్షాలతో మునిగిపోతుంటే.... మంత్రి నిద్రమత్తులో మునిగిపోతున్నారంటూ ట్వీట్ చేసింది. మంత్రి అశోక్ కుమార్ వరద సమీక్ష సమావేశానికి సంబంధించిన చిత్రాలను ట్విట్టర్‌లో పంచుకున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాజధాని బెంగళూరు సహా కర్ణాటకలోని అనేక జిల్లాలు వరదల పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని చెప్పారు. బెంగళూరు ప్రజలను వరద పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం తన వంతు తోడ్పాటును అందించే నిమిత్తం సుమారు రూ. 300 కోట్లు విడుదల చేయాలని సీఎం బొమ్మై నిర్ణయించినట్లు పేర్కొన్నారు.